ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
మంగళవారం, 25 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 12 | పేజీలు: 8 వెల: 5

## ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ దరఖాస్తుల పరిశీలన



- 60,720 దరఖాస్తుల పరిశీలన కొనసాగింపు
- అనర్హుల అభ్యంతరాలపైనా అధికారుల పరిశీలన
- 25న సాయంత్రం ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు
- వివరాలు వెల్లడించిన హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం

3



6

## భద్రాద్రి జిల్లాలో చిరుతపులి చర్మం విక్రయ ముఠా పట్టివేత

- భద్రాద్రి జిల్లాలో చిరుతపులి చర్మం విక్రయ ముఠా పట్టివేత
- 17 గోర్లు, చిరుతపులి చర్మం స్వాధీనం.. నలుగురు అరెస్టు
- బూర్గంపహాడ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సంయుక్త ఆపరేషన్
- నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు: ఎస్పీ రోహిత్ రాజ్



# మా వారి నుంచే రాజకీయ ఓనమాలు!

- మామ ప్రోత్సాహంతో 1991లో రాజకీయ అరంగేట్రం
- వైఎస్సార్ ఇచ్చిన మాట తప్పలేదు.. ఆయనే నా అన్న
- 2005లో వరంగల్ తొలి మేయర్‌గా అవకాశం
- మేయర్‌గా రూ.178 కోట్ల నిధులతో నగరంలో చారిత్రాత్మక అభివృద్ధి
- పదవులు ఉన్నా.. లేకున్నా కాంగ్రెస్‌ను వీడలేదు
- కష్టకాలంలో అనేక రాజకీయ ఆఫర్లు వచ్చినా.. వద్దనుకున్నాం
- సీఎం రేవంత్‌రెడ్డి నా పనితీరును గుర్తించారు
- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నన్ను ప్రోత్సహిస్తున్నారు
- రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదు.. పార్టీ అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా
- డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

"రాజకీయాల్లోకి రావాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. కానీ మా వారి రాజకీయ జీవితం.. మా మామ ప్రోత్సాహం నన్ను అనుకోకుండా రాజకీయాల్లోకి తీసుకొచ్చాయి. 1991లో పీఏసీఎస్ చైర్మన్‌గా పోటీ చేసినప్పటి నుంచి గెలుపోటములు, పదవులు, అవమానాలు, ప్రలోభాలు ఎన్నో చూశాం. కష్టకాలంలో ఇతర పార్టీల నుంచి ఎన్ని ఆఫర్లు వచ్చినా కాంగ్రెస్‌ను వీడలేదు. వైఎస్సార్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుని నన్ను మేయర్‌ను చేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా నా పనితీరును గుర్తించి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అవకాశం ఇచ్చారు. పదవులు అడిగి తీసుకోవడం నా పద్ధతి కాదు.. పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా వంద శాతం పనిచేయడమే తెలుసు. రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదు. పార్టీ అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేస్తా" అని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ తెలిపారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆమె తన బాల్యం, వివాహం, అత్తింటి అనుబంధం, భర్త వరద రాజేశ్వర్‌రావుతో కలిసి సాగించిన రాజకీయ ప్రస్థానం, 1991లో రాజకీయ అరంగేట్రం, ఎమ్మెల్యే ఎన్నికలో ఓటమి, 2005లో మేయర్‌గా అవకాశం, నగరాభివృద్ధి, కాంగ్రెస్‌తో సుదీర్ఘ అనుబంధం, వైఎస్సార్, రేవంత్‌రెడ్డితో తనకున్న అనుబంధం, మహిళా కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలను తన మాటల్లోనే పంచుకున్నారు.

7

### జాబ్ నోటిఫికేషన్లు

## నిల్ లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్!

- 121 మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ ఇవ్వడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్
- లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూపులు
- మద్యం వ్యాపారంపై ఉన్న శ్రద్ధ ఉద్యోగాలపై ఎందుకు లేదు?
- మాజీ మంత్రి హరీశ్‌రావు

2

## ఫీజుల బకాయిలపై బీజేపీ పోరాటం

- రూ.15 వేల కోట్ల బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థులకు ఇబ్బందులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఉన్నత విద్యను ప్రభుత్వం దెబ్బతీస్తోంది
- ఫీజులు చెల్లించకపోవడంతో సర్టిఫికెట్లు నిలిపివేస్తున్న కాలేజీలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు దీక్షకు సంపూర్ణ మద్దతు
- రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్



3





# తెలంగాణను అడ్డుకుంటున్నారా?

### యూకేకు అనుమతిచ్చి.. అమెరికాకు ఎందుకు నిరాకరించారు?

- సీఎం పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే
- "బీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా?.. గుజరాత్‌కు మద్దతిస్తున్నారా?"
- కేంద్రం వైఖరి ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం: సీఎం రేవంత్ రెడ్డి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ అభివృద్ధి కోసం విదేశీ పెట్టుబడులు, విద్య, క్రీడా రంగాల్లో అవకాశాలను ఆకర్షించేందుకు చేపట్టిన తన అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. యూకే పర్యటనకు అనుమతి ఇచ్చి.. అమెరికా పర్యటనకు మాత్రం పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వకపోవడం వెనుక కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమేంటని ప్రశ్నించారు. తన విదేశీ పర్యటనను కావాలనే అడ్డుకున్నారని ఆరోపించారు. సీఎం విదేశీ పర్యటనను అడ్డుకోవడం అంటే తనను అడ్డుకోవడం కాదని.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమేనని స్పష్టం చేశారు. కేంద్రం వ్యవహరిస్తున్న తీరు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'వికసిత్ భారత్' పేరుతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుంటే.. 'రైజింగ్ తెలంగాణ' ........(తరువాయి 2లో)



## 22ఏపై దుష్ప్రచారం నమ్మొద్దు

- 98 శాతం దరఖాస్తుల పరిష్కారం.. 24–36 గంటల్లో సమస్యలకు ఫాస్ట్‌ట్రాక్
- ప్రభుత్వ భూములను కాపాడటమే 22ఏ ఉద్దేశం
- నకిలీ జీఓలు, బోగస్ మెమోలతో భూదందాలు.. క్రిమినల్ కేసులు
- మీడియా సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** 22ఏ నిషేధిత జాబితాలో లక్షలాది ఎకరాల ప్రైవేటు భూములను చేర్చారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 2023 డిసెంబరు 7 నాటికి, ప్రస్తుతం 22ఏలో ఉన్న భూముల వివరాలను కేటగిరీల వారీగా రికార్డులతో ప్రజల ముందుంచుతున్నామని తెలిపారు. 22ఏపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దుష్ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 22ఏలోకి వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. 22ఏ సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్నామని, సాధారణ సమస్యలను 24 గంటల్లో, అవసరమైన సందర్భాల్లో గరిష్ఠంగా 36 గంటల్లో పరిష్కరించేలా చర్యలు చేపట్టామన్నారు.

**ప్రభుత్వ భూముల పరిరక్షణకే 22ఏ**

22ఏలో ఎంత భూమి ఉంది, ఎందుకు చేర్చారు, ఎవరి భూమి, ఏ కారణంతో నిషేధిత జాబితాలో పెట్టారనే వివరాలను రికార్డులతో వెల్లడిస్తామని పొంగులేటి చెప్పారు. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులను ప్రైవేటు వ్యక్తులు లేదా రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు మళ్లించకుండా కాపాడటమే 22ఏ ప్రధాన ఉద్దేశమన్నారు.

........(తరువాయి 2లో)

## సింగరేణికి ఉజ్వల భవిష్యత్

- లాభాల బాటలో నడిపిస్తాం
- బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, లిథియం, కీలక ఖనిజాల మైనింగ్‌లోకి అడుగులు
- కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనతో సంస్థకు భవిష్యత్ భరోసా
- బీఎస్ఎన్ఎల్‌లా వెనుకబడకుండా అంతర్జాతీయ స్థాయికి విస్తరణ
- ఎన్‌టీపీసీ స్థాయిలో సింగరేణిని నిలబెట్టడమే ప్రభుత్వ ధ్యేయం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణకు ఆత్మలాంటి సింగరేణి సంస్థను కాపాడుకుంటూనే భవిష్యత్ తరాలకు లాభదాయక సంస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ........(తరువాయి 2లో)

## కాళేశ్వరాన్ని వాడుకోకుండా కుట్రలు ఎందుకు?

- తుమ్మిడిహెట్టి పూర్తి చేయకుండా కాలయాపన
- అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగున్నాయన్న నివేదికపై ఎందుకు స్పందించరు?
- కన్నెపల్లి మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి





**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగించకుండా, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పూర్తి చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కుట్రలు, కుతంత్రాలకు పాల్పడకుండా వెంటనే కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ఆన్ చేసి

........(తరువాయి 2లో)



## సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు!

- నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి
- పెండింగ్ భూసేకరణను వేగంగా పూర్తి చేయాలి
- భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ అనుమతులకు నిధులు వెంటనే మంజూరు
- ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

3

# తెలంగాణను అడ్డుకుంటున్నారా?

(మొదటిపేజీ తరువాయి)

విజన్‌తో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకుందని తెలిపారు. రాష్ట్రాల కలయికతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోనే పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే విదేశీ పర్యటనలు చేపట్టామని వివరించారు.

**దాపరికం ఎక్కడుంది?**

తన అమెరికా పర్యటనలో ఎలాంటి దాపరికం లేదని రేవంత్ స్పష్టం చేశారు. విద్య, క్రీడలు, పెట్టుబడుల కోసమే అమెరికా పర్యటనకు ప్రణాళిక రూపొందించామని.. పర్యటన ఉద్దేశాలను కేంద్ర ప్రభుత్వానికి ముందుగానే స్పష్టంగా తెలియజేశామని తెలిపారు. అయినప్పటికీ విదేశాంగ శాఖ పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘‘నా పర్యటనలో దాపరికం ఏమీ లేదు. దాపరికం ఉన్నట్టు విదేశాంగ శాఖ మాట్లాడింది’’ అని వ్యాఖ్యానించారు. యూకే పర్యటనకు అనుమతిచ్చి.. అమెరికా పర్యటనకు మాత్రమే ఎందుకు నిరాకరించారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తన పర్యటన వివరాలను పూర్తిగా కేంద్రానికి అందించిన తర్వాత కూడా ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ఆరోపించారు. విదేశీ పర్యటనల ద్వారా తెలంగాణకు పెట్టుబడులు, విద్యా అవకాశాలు, క్రీడా రంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలను తీసుకురావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**గుజరాత్‌కు ఓకే.. తెలంగాణకు నో**

గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ అమెరికా పర్యటనలకు కేంద్రం అనుమతి ఇచ్చిందని.. తెలంగాణ ముఖ్యమంత్రికి మాత్రం అనుమతి నిరాకరించిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ‘‘గుజరాత్ ముఖ్యమంత్రికి అమెరికా పర్యటనలకు అనుమతి ఇచ్చారు. తెలంగాణ సీఎంకు మాత్రం అనుమతి ఇవ్వరా? నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ఇది అవమానం’’ అని అన్నారు. గుజరాత్ ఆధిపత్యానికి కేంద్రం తీసుకున్న నిర్ణయం నిదర్శనంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. తెలంగాణకు పెట్టుబడులు వస్తే గుజరాత్‌కు పోటీ పెరుగుతుందనే ఉద్దేశంతోనే తన పర్యటనను అడ్డుకున్నారా అని ప్రశ్నించారు. వైబ్రెంట్ గుజరాత్‌కు మద్దతు ఇస్తూ.. రైజింగ్ తెలంగాణను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అభివృద్ధి, పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనకు వెళ్లడాన్ని అడ్డుకోవడం ద్వారా కేంద్రం ఏ సందేశం ఇస్తోందని ప్రశ్నించారు.

**బీజేపీ ఎంపీలకు రాష్ట్ర అభివృద్ధి అవసరం లేదా?**

తెలంగాణ బీజేపీ ఎంపీలపైనా సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ‘‘తెలంగాణ బీజేపీ ఎంపీలకు రాష్ట్ర అభివృద్ధి అవసరం లేదా? వారు గుజరాత్‌కు మద్దతు ఇస్తున్నారా?’’ అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్రానికి చెందిన ఎంపీలపై ఉందన్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వారు ప్రశ్నించకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ నేతలు వివక్షణ కోల్పోయి తనపై, రాష్ట్ర ప్రభుత్వంపై అవాస్తవ ప్రచారం చేశారని రేవంత్ మండిపడ్డారు. తన పర్యటనకు అనుమతి రాకపోవడాన్ని రాజకీయంగా వక్రీకరించి ప్రచారం చేశారని ఆరోపించారు. విదేశాల్లో ఉన్న సమయంలోనే తాను ఈ అంశంపై స్పందించాలని భావించినా.. అక్కడి నుంచి మాట్లాడితే తనను దేశద్రోహిగా చిత్రీకరించే ప్రయత్నం జరిగేదని అన్నారు. ‘‘విదేశాల్లో ఉండగా మాట్లాడితే.. దేశద్రోహి, విదేశాల్లో భారత గౌరవానికి భంగం కలిగించాడని రాద్ధాంతం చేసేవారు. అందుకే హైదరాబాద్‌కు వచ్చి మాట్లాడుతున్నా’’ అని చెప్పారు.

**అధికారులను పంపాం.. ఆక్స్‌ఫర్డ్‌తో ఒప్పందం**

కేంద్రం తన అమెరికా పర్యటనను అడ్డుకున్నా.. తెలంగాణ అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను ఆపలేదని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్ర అధికారులను అమెరికాకు పంపామని తెలిపారు. పెట్టుబడులు, విద్యా రంగంలో అంతర్జాతీయ సంస్థలతో సంబంధాలు కొనసాగుతాయని చెప్పారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంతో ఒప్పందం జరగనుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి వెళ్లలేకపోయినా రాష్ట్రానికి సంబంధించిన అధికార యంత్రాంగం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనిచేస్తుందని పేర్కొన్నారు. ‘రైజింగ్ తెలంగాణ-2047’ లక్ష్యంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. విదేశాల్లో పెట్టుబడిదారులను కలవడం, తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించడం, విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేయడం, క్రీడా రంగంలో అంతర్జాతీయ అవకాశాలను తీసుకురావడం తమ పర్యటనల ప్రధాన ఉద్దేశాలని వివరించారు.

**పార్లమెంట్‌లో నిలదీస్తాం**

కేంద్రం తన పర్యటనకు అనుమతి నిరాకరించిన అంశాన్ని కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభల్లో లేవనెత్తుతారని రేవంత్ రెడ్డి తెలిపారు. ‘‘మా రాష్ట్రం విషయంలో ఎందుకీ వివక్ష?’’ అని కేంద్రాన్ని ప్రశ్నిస్తారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అంటే కేవలం కేంద్రం మాత్రమే కాదని.. రాష్ట్రాల కలయికతోనే దేశం ఏర్పడిందని గుర్తు చేశారు. రాష్ట్రాల హక్కులు, అభివృద్ధి అవకాశాలను గౌరవించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని విదేశీ పర్యటనకు వెళ్లకుండా అడ్డుకోవడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని రేవంత్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలు ముందుగానే కేంద్రానికి అందించినప్పుడు.. ప్రధాని మోదీ జోక్యం లేకుండా విదేశాంగ శాఖ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ప్రజాస్వామ్యవాదులంతా ప్రశ్నించాలని కోరారు.


**లక్ష్యాన్ని మాత్రం ఆపలేరు**

కేంద్రం తన విదేశీ పర్యటనను అడ్డుకోగలదేమో కానీ.. తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను మాత్రం అడ్డుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబరు 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ద్వారా భారీగా పెట్టుబడులను సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ‘రైజింగ్ తెలంగాణ’ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గేది లేదని.. రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన అన్ని మార్గాల్లో ముందుకు సాగుతామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# 22ఏపై దుష్ప్రచారం నమ్మొద్దు

(మొదటిపేజీ తరువాయి)

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని రెండు రెవెన్యూ గ్రామాల్లో 122 ఎకరాలు, మరోచోట 400కుపైగా ఎకరాలు కలిపి సుమారు 522 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన అంశాలను మంత్రి ప్రస్తావించారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా మార్చే ప్రయత్నాలు జరిగితే వాటిని 22ఏలో చేర్చడం తప్పా? అని ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి రెవెన్యూ గ్రామంలో సరైన ప్రభుత్వ రికార్డులు లేకుండానే 1958కు ముందు అసైన్‌మెంట్ జరిగినట్లు చూపించి భూములపై హక్కులు సృష్టించిన వ్యవహారం గుర్తించామని తెలిపారు.



**నకిలీ పత్రాలతో భూదందాలు**

ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు నకిలీ జీఓలు, మెమోలు, అధికారుల సంతకాలతో బోగస్ పత్రాలు సృష్టిస్తున్న వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయని మంత్రి చెప్పారు. మేడ్చల్ జిల్లాలో కలెక్టర్ సంతకంతో ఉన్నట్లు చూపిస్తూ 2026 ఏప్రిల్ 22 తేదీతో నకిలీ మెమో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పేరుతో జూన్ 2 తేదీతో బోగస్ సర్టిఫికెట్ సృష్టించి రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించిన వ్యవహారాలను గుర్తించామని తెలిపారు. సంబంధిత వ్యక్తులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా చూపించే అక్రమాలను సహించబోమని స్పష్టం చేశారు. భూదాన్, అసైన్డ్, ప్రభుత్వ భూముల రికార్డులను కేసులవారీగా పరిశీలించి నిజమైన హక్కుదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. 22ఏ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చాయని మంత్రి తెలిపారు. పునరావృత, ఓవర్‌ల్యాప్ కాల్స్ తొలగించగా 980 ప్రత్యేక ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వీటిలో 547 వ్యవసాయ, 433 వ్యవసాయేతర భూములకు సంబంధించినవని వివరించారు. రంగారెడ్డి నుంచి 258, మేడ్చల్ నుంచి 149, సంగారెడ్డి నుంచి 82, కామారెడ్డి నుంచి 44, యాదాద్రి భువనగిరి నుంచి 40, సిద్దిపేట నుంచి 35 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే రిలాక్సేషన్ పొందిన 22ఏ కేసుల్లో సుమారు 98 శాతం ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. 300కుపైగా ప్లాట్లలో దేవాదాయ, భూదాన్ తదితర కారణాలతో రిజిస్ట్రేషన్ సాధ్యం కాని 12-13 కేసులను మాత్రమే తిరస్కరించామని చెప్పారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోలేని వారికి వారం రోజుల్లోగా ఆ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు.

**యూఎల్‌సీపై త్వరలో విధాన నిర్ణయం**

అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) అంశంపై ప్రభుత్వం త్వరలో విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని పొంగులేటి తెలిపారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్, మేడ్చల్-మల్కాజిగిరి ప్రాంతాల్లో యూఎల్‌సీ క్లియరెన్స్‌కు సంబంధించిన సమస్యలను ప్రస్తావించారు. యూఎల్‌సీ క్లియర్ చేసిన భూములకు సంబంధించిన జీఓలు, ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. యూఎల్‌సీకి దరఖాస్తు చేయని లేదా క్లియరెన్స్ పొందని భూములు నిషేధిత జాబితాలో ఉండటం సహజమేనన్నారు. అయితే క్లియరెన్స్ పొందినవారు అవసరమైన పత్రాలు సమర్పిస్తే ప్రభుత్వం పరిశీలించి సమస్యను పరిష్కరిస్తుందని తెలిపారు. సీఎస్-7, సీఎస్-14 భూ వ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షం కోరితే సెట్ దర్యాప్తునకు ఆదేశిస్తామని మంత్రి చెప్పారు.

**తప్ప జరిగితే సరిదిద్దుతాం**

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సర్వే నంబర్ 403లో సుమారు 1,280 ఎకరాల విస్తీర్ణం ఉండగా.. అందులో కేవలం రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయని మంత్రి తెలిపారు. గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు రికార్డులు అప్‌లోడ్ చేసే సమయంలో మొత్తం సర్వే నంబర్ పేర్కొనడంతో ముఖ్యమంత్రి నివాసంతో పాటు తన నివాసం కూడా పీఓబీలో చేరిందని, గుర్తించిన వెంటనే సరిచేశామని వివరించారు. గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో 172వ సర్వే నంబర్ ప్రభుత్వ భూమి, 173వ సర్వే నంబర్ ప్రైవేటు భూమి అని తెలిపారు. 173 పేరుతో అనుమతులు తీసుకుని 172లో ప్రభుత్వ భూమిపై నిర్మాణాలు చేపట్టిన ఉదంతాన్ని ప్రస్తావించారు. “ప్రతి ఫిర్యాదును పరిశీలిస్తాం. ప్రతి రికార్డును ధ్రువీకరిస్తాం. తప్పు జరిగితే సరిదిద్దుతాం. అక్రమం జరిగితే చర్యలు తీసుకుంటాం. ప్రజలను భయపెట్టడం మా ప్రభుత్వ విధానం కాదు. ప్రజలకు భరోసా కల్పించడం మా బాధ్యత” అని పొంగులేటి స్పష్టం చేశారు.

# ఎల్‌నినో పేరుతో రైతుల నోట్లో మట్టి!

- శ్రీశైలంలో 170 టీఎంసీలున్నా పాలమూరు పంపులు నడపరా?
- ఏపీ రోజుకు 12 టీఎంసీలు తరలిస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది?
- సర్కారు దుర్మార్గాన్ని ఎండగడతాం: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



**కాకతీయ, తెలంగాణబ్యూరో:** ఎల్‌నినో పేరుతో రైతులను పంటలు సాగు చేయకుండా భయపెడుతూ రాష్ట్ర ప్రభుత్వం వారి నోట్లో మట్టి కొడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో ప్రస్తుతం 170 టీఎంసీల నీరున్నా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కేఎల్ఐ, జూరాల పంపులను నిరంతరాయంగా నడపకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే దీనిపై నోరు విప్పాలని.. లేకుంటే సర్కారు దుర్మార్గాన్ని ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. వరదలు లేకున్నా ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి రోజుకు సుమారు 5 వేల క్యూసెక్కుల రీజనరేటెడ్ నీరు జూరాలకు వస్తుందని తెలిపారు. నీళ్లు లేవంటూ ప్రభుత్వం రైతులను భయపెట్టడంతో పాలమూరు ప్రాంతంలో సగం మంది రైతులు పంటలు సాగు చేయలేదన్నారు. పంటలు వేయొద్దు.. పంటలు కొనొద్దు.. బోనస్ ఇవ్వొద్దు అన్నట్లుగా ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.

**రూ.700 కోట్లు ఖర్చు చేస్తే..**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలోని రిజర్వాయర్లను నింపేందుకు ప్రభుత్వం రూ.600-700 కోట్లు ఖర్చు చేస్తే సరిపోయేదని నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆ మేరకు చర్యలు చేపట్టి ఉంటే ఎల్‌నినో ప్రభావం ఉన్నా పాలమూరు రైతాంగానికి సాగునీరు అందేదని, భూగర్భజలాలు పెరిగేవని పేర్కొన్నారు. శ్రీశైలంలో 100 టీఎంసీల నీరు ఉన్నప్పుడే తాము పాలమూరు ప్రాంతానికి రెండు పంటలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. ప్రస్తుతం శ్రీశైలంలో 170 టీఎంసీల నీరు ఉన్నా కేఎల్ఐ కాలువ చివరి వరకు నీరు వెళ్లకపోవడం జిల్లా మంత్రుల అసమర్థతకు నిదర్శనమన్నారు. రోజుకు సగటున ఏపీ ప్రభుత్వం 12 టీఎంసీల నీటిని తరలిస్తున్నా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తెలంగాణ నీటిని ఏపీకి తరలించేందుకు అక్కడి ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను తెలంగాణ ప్రభుత్వం సలహాదారుగా నియమించుకోవడం ఏమిటని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆంధ్రా ప్రయోజనాల కోసమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. శ్రీశైలం నుంచి ఏపీ వైపు నీటిని తరలించేందుకు వెలుగోడు ప్రాజెక్టు కింద 53 టీఎంసీల సామర్థ్యంతో నల్లమల సాగర్ రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నారని తెలిపారు. 840 అడుగుల వద్ద టన్నెల్స్ నిర్మాణం పూర్తిచేస్తున్నారని, అటవీ, కేంద్ర జలవనరుల శాఖ అనుమతులు లేకుండానే పనులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. “ఈ నీటి దోపిడీని అడ్డుకోకుండా జిల్లా మంత్రి శ్రీశైలం డ్యామ్ వద్ద ధర్నా చేస్తానని చెబుతున్నారు. చేతనైతే ఆంధ్రా నీటి దోపిడీపై కేఆర్ఎంబీ వద్దకు వెళ్లి పోరాడాలి” అని నిరంజన్‌రెడ్డి అన్నారు.

**జూరాల సామర్థ్యం 6 టీఎంసీలే**

కృష్ణా నదిపై ఉన్న తొలి ప్రాజెక్టు జూరాల అని, దాని సామర్థ్యం కేవలం 6 టీఎంసీలేనని చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్ 854 అడుగులకు చేరిన వెంటనే పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ నీటిని తరలిస్తోందన్నారు. గతంలో పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 11 వేల క్యూసెక్కుల నుంచి మరో 44 వేల క్యూసెక్కుల మేర పెంచారని ఆరోపించారు. అదే సమయంలో 235 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లు నిర్మించినా వాటికి అవసరమైన అనుమతులు, నీటి కేటాయింపులు లేవని పేర్కొన్నారు. తెలంగాణలోనూ ప్రాజెక్టులు చేపట్టినట్లు చూపించేందుకు జూరాలపై మొక్కుబడి పనులు చేపట్టారని విమర్శించారు. శ్రీశైలంపై ఆధారపడిన ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంచారని నిరంజన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2,800 కోట్లు ఖర్చు చేసి కేఎల్ఐని పూర్తి చేసిందని తెలిపారు. 200కుపైగా రోజులు పంపులు నడిపినా 40 టీఎంసీల నీటిని పూర్తిగా వినియోగించుకునే పరిస్థితి లేకపోయిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా రాష్ట్ర నిధులతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించిందని చెప్పారు. అనేక అడ్డంకులు ఎదురైనా అనుమతులు సాధించి ప్రాజెక్టును పూర్తి చేశామని తెలిపారు. “పాలమూరు పంపులు, కేఎల్ఐ, జూరాల పంపులను నిరంతరాయంగా నడపాలి. ప్రాజెక్టుల్లో నీళ్లు నింపుకోకపోతే ఉన్న పంటలు కూడా చేతికి రాని పరిస్థితి వస్తుంది. ప్రభుత్వం భేషజాలకు పోకుండా ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి” అని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

**‘సర్కారు నడుపుతున్నారా.. సర్కస్?’**

కాంగ్రెస్ పార్టీలో ఎవరు ఉంటారు.. ఎవరు పోతారు అన్నది ప్రజలకు, రైతులకు సంబంధం లేదని నిరంజన్‌రెడ్డి అన్నారు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో మంత్రులు లేరని, కొన్ని శాఖలకు దిక్కులేదని విమర్శించారు. “సర్కారు నడుపుతున్నారా? సర్కస్ నడుపుతున్నారా?” అని ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఒకరిపై మరొకరికి నియంత్రణ లేదని, సాగర్ నిండినా సాగునీరు ఇవ్వబోమని మంత్రి చెప్పడం చేతగానితనమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి చేతకాకపోతే అదే విషయాన్ని ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రా సాగునీటి దోపిడీని అడ్డుకోకపోతే అత్యంత దుర్మార్గమైన ప్రభుత్వంగా కాంగ్రెస్ సర్కారు చరిత్రలో నిలిచిపోతుందని నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలు ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని, వాటితో ప్రజలకు సంబంధం లేదని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, బీఆర్ఎస్ నేత అభిలాష్ రంగినేని పాల్గొన్నారు.

# సింగరేణికి ఉజ్వల భవిష్యత్

(మొదటిపేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేవలం బొగ్గు మైనింగ్‌కే పరిమితం కాకుండా బంగారం, రాగి, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల మైనింగ్‌లోకి సింగరేణిని తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా థర్మల్ పవర్, బొగ్గు వినియోగం తగ్గే పరిస్థితుల్లో సంస్థ కూడా ఒకప్పటి బీఎస్ఎన్ఎల్‌లా వెనుకబడిపోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సింగరేణిని ఎన్‌టీపీసీ స్థాయిలో దేశంలోని అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థగా నిలబెట్టడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. సింగరేణి భవిష్యత్‌కు కీలకమైన బొగ్గు బ్లాక్‌ల సాధనలో సహకరిస్తున్న భట్టి విక్రమార్కను సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు సోమవారం సచివాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు బ్లాక్‌లు సాధించకపోవడం, ఉన్న గనులను మూసివేయడం వల్ల సింగరేణికి నష్టం జరిగిందన్నారు. సంస్థ మరో ఐదారు సంవత్సరాల్లో మూసివేసే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం కృషితో నైనీ బొగ్గు బ్లాక్‌ను సాధించామని తెలిపారు.

**కీలక బ్లాక్‌ల సాధనలో ముందడుగు**

2013లో యూపీఏ ప్రభుత్వం సింగరేణికి రీఅసైన్ చేసిన తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు దక్కించుకోవడంలో కేంద్రంతో చర్చించి విజయం సాధించామని భట్టి తెలిపారు. జెన్‌కోను ఒప్పించి మణుగూరు డిప్‌సైడ్ బ్లాక్2ను వేలంలో సింగరేణి దక్కించుకునేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఒడిశాలోని నైనీ బ్లాక్ సమస్యల పరిష్కారానికి తాను స్వయంగా వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి మార్గం సుగమం చేశామని వెల్లడించారు. ప్రస్తుతం సింగరేణిలో 43 వేల నుంచి 45 వేల మంది శాశ్వత ఉద్యోగులు, మరో 30 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలో, ప్రపంచంలో ఎక్కడ మైనింగ్ బ్లాక్‌లు అందుబాటులోకి వచ్చినా వాటిని సాధించే దిశగా సంస్థ ముందుకు సాగాలని సూచించారు.

**కీలక ఖనిజాల వైపు అడుగులు**

సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులు విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో థర్మల్ పవర్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అందుకే కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లోకి సింగరేణిని తీసుకెళ్లేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అంతర్జాతీయ అవకాశాలను అధ్యయనం చేసేందుకు దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ తదితర దేశాల్లో అవకాశాలపై అధ్యయనం కోసం అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించినట్లు చెప్పారు. ఇప్పటికే కర్ణాటకలోని ఓ గోల్డ్ మైన్ వేలంలో సింగరేణి పాల్గొని దక్కించుకుందని, భవిష్యత్తులో అక్కడ మైనింగ్ చేపడితే సంస్థకు నిరంతర రాయల్టీ లేదా ఆదాయం లభిస్తుందని వివరించారు.

**భట్టి నాయకత్వంలో సింగరేణి బలోపేతం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమర్థవంతమైన, చురుకైన నాయకత్వంలో సింగరేణి కొత్త గనుల ప్రారంభం, వ్యాపార విస్తరణ, నూతన ప్రాజెక్టులతో వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులో సింగరేణిని దేశంలోని అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటిగా నిలిపేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సింగరేణి తెలంగాణ ప్రజలంతా గర్వించాల్సిన ప్రతిష్ఠాత్మక సంస్థ అని పేర్కొన్నారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి, ప్రాతినిధ్య కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ తదితరులు మాట్లాడుతూ.. నైనీ బొగ్గు బ్లాక్ సాధన కోసం భట్టి విక్రమార్క ఒడిశాకు వెళ్లి ముఖ్యమంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో చర్చించి అనుమతులు సాధించారని కొనియాడారు. ఆయన కృషితో గత ఏడాది నైనీ బ్లాక్‌లో ఉత్పత్తి ప్రారంభమైందని, ఈ నెలలో రాష్ట్ర ఇంధన అవసరాల కోసం తొలి బొగ్గు రేకును సింగరేణికి రవాణా చేయడం సాధ్యమైందన్నారు. తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించడంలోనూ భట్టి కృషి చేశారని వారు పేర్కొన్నారు. గతంలో బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనకుండా అడ్డుకోవడం వల్ల సంస్థకు కీలకమైన రెండు గనులు చేజారాయని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం వేలంలో పాల్గొనే అవకాశం కల్పించడంతో మణుగూరు డిప్‌సైడ్2 బ్లాక్‌ను సింగరేణి దక్కించుకుందని తెలిపారు. సింగరేణిని కీలక ఖనిజ రంగంలోకి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజ అన్వేషణ లైసెన్స్ సాధించడం మరో విజయమని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లించడం, డిపెండెంట్ ఉద్యోగాల్లో గరిష్ఠ వయోపరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచడం వంటి చర్యలను వారు అభినందించారు.

# కాళేశ్వరాన్ని వాడుకోకుండా కుట్రలు ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తుమ్మిడిహెట్టి విషయంలో అప్పటి సీఎం కేసీఆర్ చొరవ చూపారని జీవన్‌రెడ్డి తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించకపోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించాల్సి వచ్చిందన్నారు. మూడు చోట్ల కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న సమయంలోనూ తుమ్మిడిహెట్టిపై ఒప్పందం కుదుర్చుకోలేకపోయారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనలో 33 నెలలు గడిచినా తుమ్మిడిహెట్టి పూర్తి చేయలేదని, మరోవైపు ఉన్న కాళేశ్వరాన్ని కూడా పూర్తిస్థాయిలో వినియోగించడం లేదని అన్నారు.

**నివేదిక వచ్చినా స్పందన ఏది?**

కాళేశ్వరాన్ని ‘కూలేశ్వరం’గా మార్చారని రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రచారంపై జీవన్‌రెడ్డి మండిపడ్డారు. కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా సంస్థ అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగున్నాయని నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ నివేదిక రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదన్నారు. నివేదిక వచ్చి నాలుగు రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీలో ఒక పిల్లర్ కుంగితే ఇప్పటివరకు మరమ్మతులు చేయలేదని ఆరోపించారు. ఎన్‌డీఎస్ఏను సాకుగా చూపిస్తూ 33 నెలలు కాలయాపన చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వ్యయంలో కేవలం 0.2 శాతం మాత్రమే నష్టం జరిగిందని పేర్కొంటూ.. రేవంత్‌రెడ్డికి లెక్కలు తెలుసో లేదో తనకు తెలియదని వ్యాఖ్యానించారు. కన్నెపల్లి వద్ద నుంచి రోజూ సుమారు 5 టీఎంసీల నీరు దిగువకు వెళ్లిపోతోందని జీవన్‌రెడ్డి తెలిపారు. రెండు నెలల క్రితమే కేటీఆర్ నాయకత్వంలో కన్నెపల్లి వద్దకు వెళ్లి మోటార్లు ఆన్ చేయాలని డిమాండ్ చేశామని గుర్తుచేశారు. అప్పుడే మోటార్లు ఆన్ చేసి ఉంటే ఎగువన ఉన్న రిజర్వాయర్లలో సుమారు 100 టీఎంసీల నీటిని నింపుకునే అవకాశం ఉండేదన్నారు. రేవంత్‌రెడ్డి భేషజాలకు పోకుండా ఇప్పటికైనా కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను ఆన్ చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎల్‌నినోను తట్టుకునే శక్తి ఉందని, అల్పపీడనాల కారణంగా కొంతమేర సాగు సాధ్యమైందని అన్నారు. ప్రాజెక్టుల్లో నీటిని నిల్వ చేసుకోకపోతే ప్రస్తుతం ఉన్న పంటలు కూడా చేతికి రాని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**‘కేసీఆర్‌కు పేరు వస్తుందనే భయం’**

కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే రేవంత్‌రెడ్డి నీటిని ఎత్తిపోసేందుకు ఆసక్తి చూపడం లేదని జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఎల్ అండ్ టీ సంస్థ ఉచితంగా మరమ్మతులు చేస్తామని చెప్పినా రేవంత్‌రెడ్డి అందుకు సుముఖంగా లేరని పేర్కొన్నారు. సుమారు రూ.200 కోట్లు ఖర్చు చేస్తే మేడిగడ్డ పిల్లర్ మరమ్మతు చేయవచ్చని, కాఫర్ డ్యామ్ నిర్మించినా నీటిని ఎత్తిపోయవచ్చని అన్నారు. తన మనుమడి ఆనందం కోసం మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు రూ.100 కోట్లు ఖర్చు చేశారని, అందాల పోటీలకు మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారని జీవన్‌రెడ్డి విమర్శించారు. రూ.200 కోట్లు ఖర్చు చేస్తే మేడిగడ్డ పిల్లర్ మరమ్మతు చేయవచ్చని అన్నారు. తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి రేవంత్‌రెడ్డి పోలవరానికి నీళ్లు వదులుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని, వాటిపై తాము మాట్లాడబోమని జీవన్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి ముందుగా పరిపాలనపై దృష్టి పెట్టాలని సూచించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన శాఖలో స్వతంత్రంగా వ్యవహరించాలని కోరారు. ‘కేసీఆర్‌ను మరిపించడం రేవంత్‌రెడ్డి తరం కాదు. తెలంగాణ గొంతును ఎండబెడుతున్నారు. రేవంత్‌రెడ్డి మూర్ఖపు పాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు’ అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, బీఆర్ఎస్వీ నేతలు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, స్వామి యాదవ్, రఘురామ్, వీరబాబు పాల్గొన్నారు.

# జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్!

- 121 మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ ఇవ్వడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్
- లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూపులు
- మద్యం వ్యాపారంపై ఉన్న శ్రద్ధ ఉద్యోగాలపై ఎందుకు లేదు?
- మాజీ మంత్రి హరీశ్‌రావు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో 121 రకాల మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ ఇవ్వడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తుంటే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. మద్యం బ్రాండ్లకు మాత్రం ఆఘమేఘాల మీద నోటిఫికేషన్లు ఇస్తోందని మండిపడ్డారు. యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వని ప్రభుత్వానికి మద్యం వ్యాపారానికి మాత్రం ఇంత తొందర ఎందుకని హరీశ్‌రావు ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం కంటే మద్యం అమ్మకాలపైనే ప్రభుత్వానికి ఎక్కువ శ్రద్ధ ఉన్నట్లుగా కనిపిస్తోందన్నారు. డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే.. ప్రభుత్వం మద్యం షాపులు, బ్రాండ్లు పెంచి ఆదాయం సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టిందని విమర్శించారు.

**రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?**

ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఏమైందని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలోనూ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని ఆరోపించారు. రాజీవ్ యువ వికాసం పథకం కూడా ఆశించిన స్థాయిలో అమలుకావడం లేదని విమర్శించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు ప్రభుత్వం గతి లేకుండా చేసిందని అన్నారు. యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్లు ఇవ్వడమే ప్రభుత్వ ప్రాధాన్యాలను స్పష్టం చేస్తోందని వ్యాఖ్యానించారు.

**యువత భవిష్యత్తుపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదా?**

సమయానికి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేని ప్రభుత్వం మద్యం షాపులు, బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్లు ఇవ్వడంలో వేగం చూపుతోందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. యువత భవిష్యత్తుకు ఉద్యోగాలు కల్పించాల్సిన ప్రభుత్వం.. మద్యం వ్యాపారాన్ని విస్తరించడంపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. ‘జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్.. ఇదేనా రేవంత్‌రెడ్డి మీరు చెప్పిన ప్రజా పాలన?’ అని హరీశ్‌రావు ప్రశ్నించారు. యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం వారిని నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు.



# నేడు జిల్లాల్లో ప్రత్యేక వనమహోత్సవం

**సెప్టెంబర్ చివరి నాటికి లక్ష్యాలు పూర్తి చేయాలి**

**మొక్కలు నాటడంతో పాటు సంరక్షణపై ప్రత్యేక కార్యాచరణ**

**ఖమ్మం జిల్లాలో 31.30 లక్షల లక్ష్యానికి**

**20.90 లక్షల మొక్కలు నాటారు**

**ప్రత్యేక వనమహోత్సవంపై ఆదేశాలు**

**అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



కాకతీయ, ఖమ్మం బ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 25న మంగళవారం భారీ స్థాయిలో మొక్కలు నాటే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లు, డీఎఫ్ఓలను ఆదేశించారు. ప్రజల్లో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. వనమహోత్సవంపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఎఫ్ఓలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. తక్కువ ప్రగతి సాధించిన జిల్లాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వనమహోత్సవంలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయడంతో పాటు ప్రతిరోజూ పర్యవేక్షణ చేపట్టాలని, మొక్కలు చనిపోతే వెంటనే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని ఆదేశించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, సెప్టెంబర్ చివరి నాటికి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఆగస్టు 25న అన్ని మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీ భూములు, దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలతో పాటు పట్టణాల్లో అర్బన్ ఫారెస్ట్రీకి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి మొక్కలు నాటాలని తెలిపారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని, అవసరమైన మొక్కలను సకాలంలో తరలించాలని ఆదేశించారు. వనమహోత్సవానికి విస్తృత ప్రచారం కల్పించి మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు.

**ఖమ్మంలో ఒకే రోజు లక్ష మొక్కలు**

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 31.30 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 20.90 లక్షల మొక్కలు నాటి 67 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. మంగళవారం ఒకే రోజు లక్ష మొక్కలు నాటేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. ఇప్పటికే 2 లక్షలకు పైగా గుంతలు సిద్ధం చేశామని తెలిపారు. మండల, గ్రామ స్థాయిల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పాఠశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండలాల వారీగా కేటాయించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీఆర్‌డీఓ బి.శిరీష,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన
# ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

**వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ**

**మౌలిక వసతులు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిధులపై వినతి**

**స్టేషన్ ఘన్‌పూర్ అభివృద్ధి పనులపై సీఎంతో చర్చ**



కాకతీయ, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన కీలక అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన, పెండింగ్ సమస్యల పరిష్కారం, ప్రజలకు అవసరమైన వివిధ అభివృద్ధి పనులకు నిధుల మంజూరు తదితర అంశాలను ఎంపీ డా. కడియం కావ్య ముఖ్యమంత్రి దృష్టి కి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అదేవిధంగా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజల అవసరాలు, పెండింగ్ సమస్యలు, వివిధ ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యమంత్రితో చర్చించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వరంగల్ పార్లమెంట్, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు వారు తెలిపారు.

## యువతిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కాకతీయ, కారేపల్లి : మూడు నెలల క్రితం అదృశ్యమైన యువతి ఆచూకీని పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించి సోమవారం సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. కారేపల్లి మండలం భల్లునగర్ తండాకు చెందిన యువతి అదృశ్యమైనట్లు మే నెలలో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి వద్ద మొబైల్ ఫోన్ లేకపోవడంతో ఆచూకీ గుర్తించడం సవాలుగా మారింది. కారేపల్లి ఎస్ఐ గోపి సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి యువతి ఆచూకీని గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన రుకుమ్ అనే యువకుడు ప్రేమ, పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి యువతిని తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. యువతిని తల్లిదండ్రులకు అప్పగించడంతో పాటు రుకుమ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కారేపల్లి ఎస్ఐ గోపి తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లు టవర్స్
# దరఖాస్తుల పరిశీలన

- 60,720 దరఖాస్తుల పరిశీలన కొనసాగింపు
- అనర్హుల అభ్యంతరాలపైనా అధికారుల పరిశీలన
- 25న సాయంత్రం ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు
- వివరాలు వెల్లడించిన హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం



కాకతీయ, హైదరాబాద్ : ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన కొనసాగుతోందని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం తెలిపారు. ప్రాథమికంగా అనర్హులుగా గుర్తించిన దరఖాస్తుదారుల నుంచి వచ్చిన అభ్యంతరాలను కూడా పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ఈ ప్రక్రియ మంగళవారం సాయంత్రం వరకు కొనసాగుతుందని, ముందుగా ప్రకటించిన విధంగా ఆగస్టు 25న సాయంత్రం అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. అవుటర్ రింగ్ రోడ్ లోపలి వైపు ఉన్న 16 అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజల నుంచి ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 60,720 మంది దరఖాస్తు చేసుకున్నట్లు గౌతం తెలిపారు. ప్రాథమిక పరిశీలన అనంతరం అనర్హులుగా గుర్తించిన వారికి సమాచారం పంపించామని, ఆగస్టు 24 సాయంత్రం వరకు వారి నుంచి అభ్యంతరాలు స్వీకరించినట్లు చెప్పారు. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో స్థిర నివాసం లేకపోవడం, ఇప్పటికే ఇల్లు లేదా ఫ్లాట్ కలిగి ఉండటం వంటి కారణాలతో కొందరిని అనర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. అలాగే వ్యక్తిగత అవసరాలకు ఫోర్ వీలర్ వినియోగిస్తున్న దరఖాస్తుదారులను అనర్హులుగా పరిగణించామని, క్యాబ్‌లుగా వాహనాలను వినియోగిస్తున్న వారిని మాత్రం అర్హులుగా గుర్తిస్తున్నట్లు వివరించారు. అనర్హులుగా గుర్తించిన వారి నుంచి వచ్చిన అభ్యంతరాలన్నింటినీ పరిశీలిస్తున్నామని, వాటిని పరిష్కరించిన అనంతరం అర్హులైన వారి తుది జాబితాను ప్రకటిస్తామని గౌతం తెలిపారు. దరఖాస్తుల పరిశీలన విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, అనుమానాలకు లోనుకావద్దని సూచించారు. దరఖాస్తు స్థితిగతులు తెలుసుకునేందుకు ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, tghb.telangana.gov.in వెబ్‌సైట్‌లో అన్ని వివరాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. దరఖాస్తుదారులకు ఏవైనా సందేహాలు ఉంటే 040-24603572 కాల్ సెంటర్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## చిరుతపులి చర్మం విక్రయ ముఠా పట్టివేత

**17 గోర్లు, చిరుతపులి చర్మం స్వాధీనం.. నలుగురు అరెస్టు**

**బూర్గంపహాడ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సంయుక్త ఆపరేషన్**

**నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు: ఎస్పీ రోహిత్ రాజ్**



కాకతీయ, తెలంగాణ బ్యూరో : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం తాళ్లగొమ్మూరు గ్రామంలో చిరుతపులి చర్మం, గోర్లను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. వారి నుంచి ఎండబెట్టిన ఒక చిరుతపులి చర్మం, 17 గోర్లు, ఒక బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు బూర్గంపహాడ్ ఎస్ఐ ఈ. నాగబిక్షం, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం తాళ్లగొమ్మూరులోని చల్లా అనిల్‌కుమార్ ఇంటి వద్ద తనిఖీలు నిర్వహించారు. అక్కడ అనుమానాస్పదంగా ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న సామగ్రిని పరిశీలించగా చిరుతపులి చర్మం, గోర్లు లభించినట్లు ఎస్పీ తెలిపారు. విచారణలో నిందితులు గత ఏడాది వేసవిలో చింతూరు మండలం గమ్మలకోట సమీపంలోని అటవీ ప్రాంతంలో గుంతలో పడి బయటకు రాలేని స్థితిలో ఉన్న చిరుతపులిని రాళ్లు, కర్రలు, బాణాలతో కొట్టి చంపినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం చిరుత చర్మం, గోర్లను భద్రపరిచి డబ్బు కోసం విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలిందన్నారు. గమ్మలకోటకు చెందిన కుంజా భద్రయ్య, కుంజా గంగరాజు, మడవి కన్నయ్య ముగ్గురు కలిసి చిరుత చర్మం, గోర్లను తాళ్లగొమ్మూరులోని అనిల్‌కుమార్ వద్దకు తీసుకువచ్చిన సమయంలో పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

# విద్యార్థుల భద్రతకు పోలీస్, బల్దియా




- వరంగల్ పబ్లిక్ స్కూల్ వద్ద ప్రత్యేక చర్యలు
- పాఠశాల వేళల్లో ప్రమాదాలు జరగకుండా సీపీ శ్వేత, కమిషనర్ వెంకన్న క్షేత్రస్థాయి పరిశీలన

కాకతీయ, వరంగల్ ప్రతినిధి: వరంగల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు స్కూల్ కు వచ్చి వెళ్లే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత, బల్దియా కమిషనర్ టి వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ పబ్లిక్ స్కూల్ నుంచి రాజ్ హోటల్ వరకు పోలీస్, బల్దియా, ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు. పాఠశాల ప్రారంభం, ముగింపు సమయాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్కూల్ వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో వాహనాల వేగ నియంత్రణ, అనవసర క్రాస్ మూమెంట్స్ నియంత్రణ, పార్కింగ్ క్రమబద్ధీకరణపై దృష్టి పెట్టారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ఓపెనింగ్స్ ను పరిశీలించి, అనధికారికంగా రోడ్డు దాటే చోట ఓపెనింగ్స్ మూసివేయాలని, అవసరమైన చోట మాత్రమే ఉంచాలని నిర్ణయించారు. ప్రమాదం జరిగాక స్పందించడం కంటే ముందే నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల భద్రతే ప్రధానమని స్పష్టం చేశారు. పాఠశాల వేళల్లో ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ పెంచడం, బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం, తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, డీసీపీ సెంట్రల్ జోన్ ధార కవిత, ఏసీపీ ట్రాఫిక్ సత్యనారాయణ, ఆర్ అండ్ బీ జిల్లా అధికారి, ఎస్ఈ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల బకాయిలపై
# బీజేపీ పోరాటం

- రూ.15 వేల కోట్ల బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థులకు ఇబ్బందులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఉన్నత విద్యను ప్రభుత్వం దెబ్బతీస్తోంది
- ఫీజులు చెల్లించకపోవడంతో సర్టిఫికెట్లు నిలిపివేస్తున్న కాలేజీలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు దీక్షకు సంపూర్ణ మద్దతు
- : రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్



కాకతీయ,తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలో పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించే వరకు పోరాటం కొనసాగిస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్ అన్నారు. 'ఫీజుల బకాయి–బీజేపీ లడాయి' పేరుతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, దీంతో 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలు ప్రభావితమవుతున్నాయని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కేవలం ప్రభుత్వ నిధుల కేటాయింపు కాదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాల పేద విద్యార్థుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని లక్ష్మణ్ పేర్కొన్నారు. పేదరికం నుంచి బయటపడేందుకు ఉన్నత విద్యను ఆశ్రయించిన విద్యార్థులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో పలు కాలేజీలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, చదువు పూర్తయిన విద్యార్థులు ఉద్యోగాలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నిధుల కొరతతో ప్రైవేట్ విద్యాసంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అధ్యాపకులు కూడా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు.

**విద్యార్థులను అవమానించడం సరికాదు**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని లక్ష్మణ్ ఆరోపించారు. తమ న్యాయమైన హక్కుల కోసం ప్రశ్నిస్తున్న విద్యార్థులపై పోలీసులు అర్ధరాత్రి దాడులు, లాఠీచార్జీలు చేయడం సరికాదన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'క్రిమినల్ వేస్ట్' అంటూ సంబోధించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను రాహుల్‌గాంధీ తెలంగాణకు వచ్చి స్వయంగా తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, గురుకులాల్లోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా పేద విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, ఎడ్యుకేషన్ కిట్లు పూర్తిస్థాయిలో అందలేదన్నారు. గురుకులాల్లో ఆహార నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి తన వద్దే ఉంచుకుని విద్యావ్యవస్థను సంక్షోభంలోకి నెట్టారని, రేవంత్‌రెడ్డి తక్షణమే విద్యాశాఖ బాధ్యతల నుంచి వైదొలగాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే రూ.15 వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే విద్యార్థుల పక్షాన బీజేపీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.

## సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు!

- నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి
- పెండింగ్ భూసేకరణను వేగంగా పూర్తి చేయాలి
- భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ అనుమతులకు నిధులు వెంటనే మంజూరు
- ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాప్రతినిధులకు తెలిపారు. బ్రిటన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన సీఎం.. అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు మరింత దృష్టి సారించాలని సూచించారు. ప్రధానంగా నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను వేగంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. భూసేకరణలో నిర్లక్ష్యం చేస్తే ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తికావని స్పష్టం చేశారు. భూసేకరణతో పాటు పునరావాసం, పునరావాస ప్యాకేజీ (ఆర్‌అండ్‌ఆర్), అటవీ అనుమతులకు సంబంధించిన నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టుల పనులు ముందుకు సాగేలా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం పాల్గొన్నారు. ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, కడియం కావ్య, రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో పాటు ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, వీర్లపల్లి శంకర్, ప్రేమ్‌సాగర్‌రావు, నవీన్ యాదవ్, మట్టా రాగమాయి, మందుల సామేల్, వేడ్మ బొజ్జు, కోరం కనకయ్య, లక్ష్మీకాంతరావు, రాందాస్ నాయక్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్, బత్తుల లక్ష్మారెడ్డి, మనోహర్‌రెడ్డి, తెల్లం వెంకట్‌రావు, నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలి

- కొండా సురేఖ వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీనే నిర్ణయం తీసుకుంటుంది
- షోకాజ్ నోటీసులపై తాను మాట్లాడబోను
- పార్టీ నిబంధనలకు అనుగుణంగా నేతలు వ్యవహరించాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

కాకతీయ, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ నేతలంతా పార్టీ నిబంధనలు, క్రమశిక్షణకు అనుగుణంగా కట్టుబడి ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన వ్యవహారాలను తాను చర్చించబోనని, ఆ అంశాన్ని క్రమశిక్షణ కమిటీయే చూసుకుంటుందని తెలిపారు. కొండా సురేఖకు సంబంధించిన వ్యవహారంలో క్రమశిక్షణ కమిటీ అన్ని అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటుందని సీఎం పేర్కొన్నారు. పార్టీ నేతలు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో మంత్రి కొండా సురేఖ జన్మదినం సందర్భంగా ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ ఈ అంశాన్ని పరిశీలిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై సుస్మిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. సుస్మిత చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిగత అభిప్రాయాలని, వాటికి తనను బాధ్యురాలిని చేయవద్దని మంత్రి సురేఖ క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## పెండింగ్ సమస్యలు పరిష్కరించాలంటూ

# ఉద్యోగుల జేఏసీ నోటీసు

- ఈనెల 27న ములుగు కలెక్టరేట్ ఎదుట మహాధర్నాకు పిలుపు
- పీఆర్సీ అమలు.. ఆరు డీఏలు విడుదల చేయాలని డిమాండ్
- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : జేఏసీ చైర్మన్ పోలు రాజు



కాకతీయ, ములుగు ప్రతినిధి : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న ములుగు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రకటించింది. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేం దర్‌జీ, జిల్లా ఎస్పీ సుదీర్ రాంనాథన్ కేకన్‌కు జేఏసీ నాయకులు మహాధర్నా నోటీసు అందజేశారు. జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు పోలు రాజు ఆధ్వర్యంలో నాయకులు అధికారులను కలిసి నోటీసు ఇచ్చారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉపయోగపడేలా హెల్త్ కార్డుల విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సాను కూలంగా స్పందించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాధ ర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఆర్ టీయూ జిల్లా అధ్యక్షుడు వి. యాకూబ్‌రెడ్డి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి కందుల జీవన్‌కుమార్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి మేడి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## క్వారీల వ్యవహారంలో నాపై దాడికి స్కెచ్

- మూడు కార్లతో వెంబడించి వాహనాన్ని ఢీకొట్టారు
- లారీ కింద పడేసి చంపే ప్రయత్నం చేశారు
- నాకు ప్రాణహాని ఉంది.. పోలీసులు రక్షణ కల్పించాలి
- బీఆర్ఎస్ నేత చందా చక్రపాణి సంచలన ఆరోపణలు



కాకతీయ, ములుగు ప్రతినిధి : క్వారీల వ్యవహారంలో తనపై ప్రాణాంతక దాడికి కుట్ర జరిగిందని మాజీ రెక్కో చైర్మన్ చందా చక్రపాణి ఆరోపించారు. ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరుకూరు, టేకుల గూడెం ప్రాంతాల్లోని మూడు ఇసుక క్వారీల వ్యవహారంలో తనను లక్ష్యంగా చేసుకుని కొందరు దాడికి పాల్పడ్డారని తెలిపారు. గ్రామాల ప్రజల సమ్మతితో సొసైటీలు ఏర్పాటు చేసి, వారి అనుమతులు, పత్రాల ఆధారంగానే క్వారీలకు అనుమతులు తీసుకున్నానని చెప్పారు. 2019 నుంచి 2024 వరకు అనుమతుల కోసం ఇబ్బందులు ఎదుర్కొని, చివరకు కోర్టును ఆశ్రయించి అనుమతులు పొందినట్లు వివరించారు. ఓ పంచాయతీ పేరుతో తనను పిలిచి మాట్లాడిన అనంతరం అదే రోజు సాయంత్రం తాడ్వాయి దాటి కొండపర్తి స్టేజ్ సమీపంలో మూడు కార్లతో వెంబడించారని ఆరోపించారు. ఒక కారు తన వాహనానికి అడ్డంగా పెట్టగా, వెనుక నుంచి వచ్చిన మరో రెండు కార్లు ఢీకొట్టాయని తెలిపారు. అనంతరం తన కారును ధ్వంసం చేసి దాడి చేశారని, లారీ కింద పడేసి హత్య చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఓ సందులోకి వెళ్లి తప్పించుకున్నానని చెప్పారు. తనపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రాణహాని ఉన్నందున పోలీసు రక్షణ కల్పించాలని చక్రపాణి కోరారు. తనపై దాడి వెనుక రాజకీయ ప్రోత్సాహం ఉందని, బీఆర్ఎస్ నాయకుడినేనే కారణంతో వ్యాపారాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

## ఓటు హక్కుపై ప్రతి ఓటరూ


# అప్రమత్తంగా ఉండాలి


- గీసుగొండ మండలంలో 11,824 మంది ఓటర్లకు నోటీసులు
- 2002 నాటి వివరాలు, ప్రస్తుత వివరాల్లో వ్యత్యాసాలున్న వారికి జారీ
- ఈనెల 27 నుంచి బీఎల్‌ఓలు, జీపీఓలు అందుబాటులో
- ఓటర్లు అవసరమైన పత్రాలు సమర్పించాలి
- తహసీల్దార్ ఎం.డి. రియాజుద్దీన్



కాకతీయ, గీసుగొండ : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు విషయంలో ప్రతి ఓటరూ అప్రమత్తంగా ఉండాలని గీసుగొండ తహసీల్దార్ ఎం.డి. రియాజుద్దీన్ సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బీఎల్‌ఓలు, జీపీఓలతో సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. మండలంలోని 52 పోలింగ్ బూత్‌ల పరిధిలో వివిధ కారణాలతో 11,824 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. 2002లో ఓటరుగా నమోదైన వివరాలకు, ప్రస్తుతం ఉన్న వివరాలకు వ్యత్యాసం ఉన్న ప్రతి ఒక్కరికీ నోటీసులు అందజేస్తామన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును కొనసాగించేందుకు ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు కార్డులు, ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకదాన్ని బీఎల్‌ఓలకు సమర్పించాలని సూచించారు. ఈనెల 27 నుంచి గ్రామ పంచాయతీ, వార్డు కార్యాలయాల్లో బీఎల్‌ఓలు, జీపీఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు. గ్రేటర్ వరంగల్‌లోని 15, 16, 17 డివిజన్లతో పాటు గీసుగొండ మండలంలోని అన్ని గ్రామాల్లో నోటీసులు అందుకున్న ఓటర్లు పత్రాలు సమర్పించి, ఫొటో కూడా దిగాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కె. రామన్న, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు ఉదయశ్రీ, సాంబయ్య, మధుచందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# హరిలో రంగ హరి!







- అవినీతికి దారులు తెరిచిన అధికారి
- వరంగల్ బల్దియా నిధులు పక్కదారి
- పనులు చేయకున్నా బిల్లులు కాజేసే యత్నం
- వెలుగులోకి ఒకటి, రానివి ఇంకెన్నో?
- బరి తెగించిన కొందరు ఇంజినీరింగ్ అధికారులు
- పట్టించుకోని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు
- విచారణకు ముందుకు రాని విజిలెన్స్ విభాగం

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : వరంగల్ మహానగర పాలక సంస్థ కార్యాలయంలో అవినీతి పొగలు చెలరేగుతూనే ఉన్నాయి. అక్రమాల పుట్టలు బయటపడుతూనే ఉన్నాయి. సిబ్బంది, ఉద్యోగులు, అధికారుల వరకు బల్లకింద చేతులు పెడుతూనే ఉన్నారు. ఒక్కో పనికి ఒక్కో రేటు పెట్టి ఓ ప్యాకేజీలా అవినీతికి అర్రులు చాస్తూనే ఉన్నారు. కొందరు అధికారులు అభివృద్ధి ప్రణాళికల ముసుగులో చేయని పనులకు ప్రజాధనం కొల్లగొట్టేందుకు వెనుకాడడం లేదని తెలుస్తోంది. బల్దియాలో నెలకొన్న పరిస్థితులను పరిశీలిస్తే.. హరిలో రంగ హరి అంటూ అవినీతి, అక్రమాల బాగోతాలపై వీధివీధినా హరికథల్లా వినిపించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇంజినీరింగ్ అధికారులు కొందరు ఇలాంటి అక్రమాలకు దారులు తెరిచి, ప్రజాధనంతో సొంత ఆస్తులు కూడబెట్టుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. తమకు అనుకూలంగా కాంట్రాక్టర్లను ఏజెంట్లుగా పెట్టుకుని ఇతర కాంట్రాక్టర్లకు ఎరవేసి.. ముందస్తుగానే కమీషన్లు దండుకుని.. ఆ తర్వాత బిల్లులు నొక్కుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా, ఓ అక్రమ వ్యవహారం బట్టబయలైన నేపథ్యంలో ఇంకెన్ని బిల్లులు, ఎంతమంది అధికారులు నిధుల దోపిడీకి పాల్పడ్డారో అనే అనుమానాలు కలుగుతున్నాయి.

### విజిలెన్స్ విహారయాత్ర కెళ్లిందా?

సాధారణంగా బల్దియాలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తితే విజిలెన్స్ విభాగం విచారణకు దిగేది. కానీ, కొన్నేళ్లుగా బల్దియాలో విజిలెన్స్ విభాగం అడుగుపెట్టిన దాఖలాలు లేవు.రెండేళ్ల కిందట అప్పటి బల్దియా కమిషనర్ సత్పతి పమేలా సంతకం ఫోర్జరీ కేసులో కూడా విజిలెన్స్ ఎలాంటి చర్యలకు దిగలేదు. ఆ కేసుల సుమారు రూ.4కోట్లు కాజేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినా.. ఇప్పటివరకు ఆ కేసు ఏస్థాయిలో ఉందో కూడా బయటకు పొక్కలే దు. అస్సలు ఆ డబ్బులు రికవరీ అయినట్టా? కోర్టులో మగ్గుతోందా? అనేది కూడా బల్దియా ఉన్నతాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. చట్టం తన పని తను చేసుకుంటూ పోతుందన్న వ్యాఖ్యలు.. కేసు పూర్వాపరాల చర్చకు అవకాశం లేకుండా పోతోంది. ఇదే అదనుగా అధికారులు.. అవినీతి, అక్రమాలకు కొత్తదారులు వెతుక్కుంటూ ప్రజాధనాన్ని యధేచ్ఛగా దోచుకునే ప్రయత్నాలు చేస్తుం డడం విస్మయానికి గురి చేస్తోంది.

### ఆ ఒక్కటి పక్కన పెడితే..!

హన్మకొండలో గల ఎన్జీవోస్ కాలనీ పార్కుల్లో జిరాఫీ, నెమలి, బాతు, కోతి విగ్రహాల ఏర్పాటు పనులు చేయకున్నా బిల్లులు కాజేసేందుకు ఓ ఇంజినీరింగ్ అధికారి స్కెచ్ వేసిన బెడిసి కొట్టిన వ్యవహారం 2020లో జరిగింది. ఈ వ్యవహారం 10, 15 రోజులుగా బల్దియాలో చర్చ జరుగుతోంది. అదికాస్తా ఆనోటా ఈనోటా గత రెండు రోజుల క్రితం బయట పడింది. అక్రమాలు, అవినీతికి సంబంధించిన స్క్రీన్ షాట్లు ఇప్పుడు వైరల్ కావడం గమనార్హం. ఈ బాగోతం పక్కన పెడితే.. బల్దియా పరిధిలో ఇంకా చాలా పార్కులు ఉన్నాయి. ఖిలావరంగల్లో ఒక పార్కు, భద్రకాళి బండ్, వడ్డేపల్లి బండ్, దేశాయిపేట చెరువు బండ్, హన్మకొండ పబ్లిక్ గార్డెన్, ఏకశిలా పార్కు, బాలసముద్రంలో చిల్డ్రన్స్ పార్కు, ఇంకా నాలుగైదు చోట్ల పార్కులు ఉన్నాయి. ఈ పార్కుల్లో కూడా అడపాదడపా అభివృద్ధి పనులు చేస్తూనే ఉన్నారు. తాజాగా, వరంగల్ మ్యూజికల్ గార్డెన్ను పున:ప్రారంభించారు. ఈ గార్డెన్లో పలు రకాల పనులు చేశారు. భద్రకాళి బండ్ పనులు ఐదారేండ్లుగా సాగుతూనే ఉన్నాయి. అయితే, పూర్తయిన పనులు, చేస్తున్న, చేపడుతున్న పనులన్నీ ప్రణాళికల మేరకే చేశారా? చేస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రణాళికల్లో లేని పనులకు కూడా బిల్లులు కాజేసే పన్నాగాలు ఉన్నాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా విజిలెన్స్ విహారయాత్ర ముగించుకుని.. పనులు, బిల్లులు, నిధుల లెక్కలు పరిశీలిస్తుందా? అనేది వేచిచూడాల్సిందే.

# పేదల భూమిని లాక్కునే కుట్ర!



- 2005 నుంచే గుడిసెల్లో ఉంటున్నారు
- ఇప్పుడు ఖాళీ చేయించే ప్రయత్నం
- కోర్టు వివాదంలో ఉన్న భూమిలో కాంప్లెక్స్ నిర్మాణానికి ఎన్ఓసీ ఎలా ఇచ్చారు?
- దొంగ పత్రాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నం
- పేదల పక్షాన పోరాడతాం
- మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్



కాకతీయ, కాజీపేట : వైఎస్ఆర్ నగర్‌లో పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్‌భాస్కర్ ఆరోపించారు. షాపూర్ ఇరాని కుటుంబ సభ్యులమంటూ కొందరు వచ్చి గుడిసెవాసులను ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 2005 నుంచే పేదలు అక్కడ నివసిస్తున్నారని, వారికి ఇంటి నంబర్లు, ఆధార్, ఓటర్ కార్డులు కూడా ఉన్నాయని తెలిపారు. సోమవారం వైఎస్ఆర్ నగర్‌లో గుడిసెవాసులను కలిసి సమస్యలను తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. కోర్టు వివాదంలో ఉన్న భూమిపై మూడేళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం కాంప్లెక్స్ నిర్మాణానికి ఎన్ఓసీ ఎలా ఇచ్చిందని వినయ్‌భాస్కర్ ప్రశ్నించారు. దొంగ పత్రాలు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎన్ఓసీ ఎలా ఇచ్చారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు అనుమానాలున్నాయని పేర్కొన్నారు.

### పేదలను భయపెడుతున్నారు

వైఎస్ఆర్ నగర్ గుడిసెవాసులను డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామంటూ భయపెడుతున్నారని వినయ్‌భాస్కర్ ఆరోపించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేటు నిర్మాణాలకు వినియోగించడం సరికాదన్నారు. ఆ భూమిలో ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని సూచించారు. గుడిసెవాసులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎన్నికల సమయంలో రైల్వే రిటైర్డ్ ఉద్యోగుల కోసం భూమి కేటాయించే విషయంలో తమపై కేసులు నమోదు చేశారని వినయ్‌భాస్కర్ తెలిపారు. అయితే ఆ కేసులను కోర్టు కొట్టివేసిందన్నారు. ఇప్పుడు అదే భూమిపై అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఎలా వచ్చాయో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ తమపై దౌర్జన్యం చేస్తున్నారని గుడిసెవాసులు ఫిర్యాదు చేస్తే.. ఫిర్యాదు చేసిన వారిపైనే కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు.

### సుప్రీంకోర్టు వరకు పోరాటం

పేదల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని వినయ్‌భాస్కర్ స్పష్టం చేశారు. అవసరమైతే ఈ అంశాన్ని సుప్రీంకోర్టు వరకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అనంతరం రైల్వే రిటైర్డ్ ఉద్యోగులతోనూ మాట్లాడి భూమికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు ఫస్ట్ ప్రయారిటీ

**కలెక్టర్ సత్య శారద ఆదేశం**

**145 వినతులు స్వీకరణ రెవెన్యూ, బల్దియా, హౌసింగ్ సమస్యలే అధికం**



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా సత్య శారద ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 145 దరఖాస్తులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 42, జీడబ్ల్యూఎంసీకి 26, హౌసింగ్ కు 14, డీఆర్డీవోకు 14, ఇతర శాఖలకు 49 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ, సమగ్రంగా పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిరుద్యోగ సమస్యపై వచ్చిన వినతులను పరిశీలించిన కలెక్టర్, టైలరింగ్ లో ప్రావీణ్యం ఉన్న వారికి కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం మండలాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తోందని, పెన్షన్ వంటి సమస్యలపై ప్రజలు అక్కడే దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వై.వి.గణేష్, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఎంహెచ్ వో డా రాజారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## విగ్రహాల విక్రయాలకు కొత్త రూల్స్

- రోడ్లపై అమ్మకాలు బంద్
- ట్రాఫిక్ కు ఇబ్బంది వద్దు, ప్రశాంతంగా ఉత్సవాలు జరగాలి
- కమిషనర్ టి వెంకన్న



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో నగరంలో గణేష్ విగ్రహాల విక్రయాలు ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా, ప్రశాంత వాతావరణంలో జరగాలని బల్దియా కమిషనర్ టి వెంకన్న సూచించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులు, విగ్రహాల తయారీదారులు, విక్రయదారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన రహదారులు, డ్రైనేజీలపై విగ్రహాలు పెట్టి అమ్మవద్దు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా, ప్రమాదాలకు తావులేకుండా గుర్తించిన ప్రాంతాల్లోనే అమ్మకాలు చేపట్టాలని స్పష్టం చేశారు. విక్రయాలకు అనువైన ప్రాంతాలుగా హన్మకొండలో పద్మాక్షిమైదానం, హయగ్రీవాచారి గ్రౌండ్స్, ఉర్సు, ఓసిటీ మైదానం, ఖిలా వరంగల్ మైదానాలు, తోట మైదానాలను గుర్తించినట్లు తెలిపారు. విక్రయదారుల సూచనల మేరకు అక్కడ కనీస సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ విక్రయాలు క్రమబద్ధంగా జరిగేలా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రాజ్ కుమార్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీంద్ర డీ రాడేకర్, ఏసీపీ ఖలీల్, ట్రాఫిక్ సీఐలు సుజాత, వెంకన్న, రామకృష్ణ, లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు ఆదేశాలు బేఖాతార్

- ఆదేశాలిచ్చి చేతులు దులుపుకున్న భూపాలపల్లి డీఈవో
- లోన్ తీసుకున్న ఉపాధ్యాయుడికి ఫుల్ జీతం
- ష్యూరిటీ ఇచ్చిన టీచర్ జీతంలో కట్
- పరిస్థితిపై కోర్టు ఆగ్రహం.. వెంటనే చర్యలు చేపట్టాలంటూ విద్యాశాఖకు ఆదేశం
- కోర్టు ఆదేశాల అమలును పట్టించుకోని భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ యంత్రాంగం

కాకతీయ, భూపాలపల్లి : ఓ ఉపాధ్యాయుడు తీసుకున్న రుణానికి ష్యూరిటీగా నిలిచిన మరో ఉపాధ్యాయుడి జీతం నుంచి డబ్బులు మినహాయిస్తున్నప్పటికీ.. అసలు రుణం తీసుకున్న ఉపాధ్యాయుడి జీతం నుంచి మాత్రం ఎలాంటి కోతలు లేకపోవడం వివాదాస్పదంగా మారింది. ఈ వ్యవహారంలో కోర్టు జోక్యం చేసుకుని జీతం నుంచి మొత్తాన్ని మినహాయించి చెల్లించాలని ఆదేశించినా.. ఆ ఆదేశాల అమలు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ యంత్రాంగం కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపురం జెడ్పీఎస్ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న అడెపు వెంకటేశ్వర్లు రుణ వ్యవహారంలో ష్యూరిటీగా ఉన్నట్లు కోర్టు పరిధిలోకి వెళ్లిన కేసు ద్వారా తెలుస్తోంది. రుణ బకాయిలకు సంబంధించి శ్రీ రామం చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హనుమకొండ నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించింది. సంస్థకు మొత్తం రూ.11,20,821 బకాయి ఉన్నట్లు పేర్కొంటూ కోర్టును ఆశ్రయించింది. ఈ వ్యవహారంలో కోర్టు ఆదేశాల మేరకు వెంకటేశ్వర్లు జీతం నుంచి రూ.3,73,607 మొత్తాన్ని మినహాయించాలని డీఈవో కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

### డీఈవో ఉత్తర్వులు.. అమలు ఏది?

కోర్టు ఆదేశాలను ఉటంకిస్తూ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. రాజేందర్ 2026 జూలై 22న రంగాపురం జెడ్పీఎస్ఎస్ హెడ్‌మాస్టర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. జీతం నుంచి నిర్దేశిత మొత్తాన్ని మినహాయించి హనుమకొండ నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పేరిట డీడీ రూపంలో చెల్లించాలని ఆదేశించారు. అలాగే తీసుకున్న చర్యలపై వెంటనే తమ కార్యాలయానికి సమాచారం అందించాలని స్పష్టం చేశారు. అయితే ఆ ఉత్తర్వులు జారీ చేసి నెల రోజులు దాటుతున్నా.. కోర్టు ఆదేశాల మేరకు జీతం నుంచి మినహాయింపులు జరిగాయా? మినహాయించిన మొత్తం కోర్టుకు చేరిందా? అనే విషయాలపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిన విద్యాశాఖ అధికారులు ఆ తర్వాతి పరిణామాలను పర్యవేక్షించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### లోన్ తీసుకున్న వ్యక్తికి ఫుల్ జీతం?

ఈ వ్యవహారంలో ప్రధానంగా మరో ప్రశ్న తలెత్తుతోంది. రుణం తీసుకున్న వ్యక్తి జీతం నుంచి కాకుండా ష్యూరిటీ ఇచ్చిన ఉపాధ్యాయుడి జీతం నుంచి మాత్రమే కోతలు ఎందుకు? అన్నదే ఆ ప్రశ్న. ఒకవైపు బాధిత ఉపాధ్యాయుడి జీతం నుంచి మినహాయింపులు జరుగుతున్నట్లు చెబుతుండగా.. మరోవైపు అసలు రుణగ్రహీతకు పూర్తి జీతం అందుతున్న పరిస్థితి ఉంటే దానిపై అధికారులు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడంలో జాప్యం జరగడం, సంబంధిత ఉద్యోగుల జీతాల విషయంలో భిన్నమైన పరిస్థితులు ఉండటం పట్ల బాధిత



వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కోర్టు ఆదేశాలను అమలు చేయాలని డీఈవో స్వయంగా ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో.. వాటి అమలుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? జీతం నుంచి ఎంత మొత్తం మినహాయించారు? మినహాయించిన మొత్తాన్ని కోర్టుకు ఎప్పుడు చెల్లించారు? అసలు రుణగ్రహీత జీతం నుంచి ఎందుకు మినహాయింపులు చేయలేదు? అనే ప్రశ్నలకు విద్యాశాఖ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. కోర్టు ఆదేశాలు కాగితాలకే పరిమితం కాకుండా పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించి, కోర్టు ఆదేశాల అమలులో జాప్యానికి కారణాలను వెల్లడించాలని పలువురు కోరుతున్నారు.

## 20 ఏళ్ల సేవకు వేతన కోతా?

- బల్దియా ముందు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన
- హోదాలు తగ్గించి జీతాలు కోస్తే ఎలా బతకాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన
- జీవో 69, 56 వద్దు
- పాత వేతనాలే ముద్దు కమిషనర్ కు వినతి




కాకతీయ, వరంగల్ ప్రతినిధి : 20–25 ఏళ్లుగా బల్దియాకే సేవ చేస్తున్నామని, ఇప్పుడు హోదా తీసేసి జీతం తగ్గిస్తే పిల్లల ఫీజులు ఎలా కట్టాలి? అంటూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బల్దియా కౌన్సిల్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం బల్దియా ప్రజావాణిలో కమిషనర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం జీవో ఆర్టీ 69 (01.02.2025), జీవో 56 (28.01.2026) ద్వారా అన్ని హోదాలను కేవలం పబ్లిక్ హెల్త్, నాన్–పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా కుదించి వేతనాలను తగ్గిస్తోందని, ఇది రాష్ట్రంలో, దేశంలో ఎక్కడా లేని విధంగా జీవితాలతో ఆడుకోవడమేనని ఆరోపించారు. 2016 జీవో ప్రకారం, కౌన్సిల్ ఆమోదంతో వస్తున్న వేతనాలకే 30% పెంపు ఇచ్చి కొనసాగించాలి. కొత్తగా వచ్చే వారికి కొత్త జీవో వర్తింపజేయాలని సీడీఎంఏ హామీ ఇచ్చినా ఇప్పుడు అందరి జీతాలు కోస్తున్నారు. ప్రస్తుత ధరలకు ఈ జీతాలు ఏ మాత్రం సరిపోవని వాపోయారు. వేతన కోతను వెంటనే ఆపి పాత హోదాలు, పాత వేతనాలను కొనసాగించాలని బల్దియా కమిషనర్ టి వెంకన్న ను కోరారు.

## వరంగల్ జిల్లాలో 129 కిలోల గంజాయి పట్టివేత..

**అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు..**

**వర్ధన్నపేట వద్ద కారులో తరలిస్తుండగా నార్కోటిక్స్ పోలీసుల పట్టివేత..**




కాకతీయ, వరంగల్ బ్యూరో : వరంగల్ జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. వర్ధన్నపేట సమీపంలో కారులో అక్రమంగా తరలిస్తున్న 129 కిలోల గంజాయిని నార్కోటిక్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.65 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. నార్కోటిక్స్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసిన అంతర్రాష్ట్ర స్మగ్లర్లు దానిని బెంగళూరు మీదుగా కేరళకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వర్ధన్నపేట వద్ద వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు భారీ మొత్తంలో గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో కేరళకు చెందిన సాయిజ్, మాథ్యూ అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గంజాయితో పాటు అక్రమ రవాణాకు ఉపయోగించిన కారు, రెండు మొబైల్ ఫోన్లు, నగదును స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ గంజాయి అక్రమ రవాణా వెనుక ప్రధాన సూత్రధారులుగా భావిస్తున్న అజిత్, విక్కీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలింపు చేపట్టారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు, ఇతర ఆధారాల ఆధారంగా గంజాయి సరఫరా నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు నార్కోటిక్స్ పోలీసులు వెల్లడించారు. ఒడిశా నుంచి కేరళ వరకు సాగుతున్న అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణా వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉండే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత ఈ ముఠాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.17

# ప్రజా వైద్యంతో చెలగాటమా







- 'పేరుకే 24 గంటల ఆసుపత్రి' కథనంపై ఎమ్మెల్యే తక్షణ స్పందన
- రాయపర్తి పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు
- వార్డులు, మందుల నిల్వలు, హాజరు రిజిస్టర్ల పరిశీలన
- సాయంత్రం 4 గంటలకే ఆసుపత్రికి తాళాలు వేయడంపై ఎమ్మెల్యే ఆగ్రహం
- రోగులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి

కాకతీయ, రాయపర్తి : ప్రభుత్వ వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి స్పష్టం చేశారు. ఆగస్టు 22న 'ఉత్తరం కాకతీయ' దిన పత్రికలో 'పేరుకే 24 గంటల ఆసుపత్రి' శీర్షికన ప్రచురితమైన కథనంపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే.. సోమవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. సాయంత్రం నాలుగు గంటలకే ఆసుపత్రికి తాళాలు వేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల వైద్య సేవలు అందించాల్సిన పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

### నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యం అందించడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను వెంటనే కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రిలో వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాకతీయ కథనంపై తక్షణమే స్పందించి పీహెచ్‌సీని సందర్శించడంతో మండల ప్రజలు ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అరుణ్ చంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- మిల్స్ కాలనీ పరిధిలో వరుస ఇళ్లలో చోరీలు
- రూ.12 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- మహారాష్ట్రలోనూ గతంలో నాలుగు చోరీ కేసులు
- నిందితుడిని అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత వెల్లడి




కాకతీయ, వరంగల్ బ్యూరో : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను మిల్స్ కాలనీ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా సోమవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన 70.19 గ్రాముల బంగారు ఆభరణాలు, 527.9 గ్రాముల వెండి, రూ.29,875 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల వరుస చోరీలు జరగడంతో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ గతంలో జరిగిన చోరీలను విశ్లేషించిన పోలీసులు అనుమానితుడిపై నిఘా పెట్టారు.

### తాళం వేసిన ఇళ్లే టార్గెట్

నిందితుడిని పెద్దపల్లికి చెందిన ఆశిష్ శ్రీనివాస్ రెడ్డిమల్లగా గుర్తించారు. ప్రస్తుతం మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో నివసిస్తున్న అతడు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పగటి సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి.. రాత్రివేళల్లో అక్కడికి వెళ్లి చోరీలకు పాల్పడేవాడని పోలీసులు తెలిపారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిందితుడిని అరెస్టు చేసి, అతడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివనగర్, ఎస్‌ఆర్‌ఆర్ నగర్ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలో జరిగిన వరుస చోరీలకు నిందితుడే పాల్పడినట్లు విచారణలో అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు 2024, 2025 సంవత్సరాల్లో మహారాష్ట్రలో నాలుగు చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆయా కేసుల్లో అక్కడి పోలీసులు అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. అనంతరం బెయిల్‌పై విడుదలైనప్పటికీ అతడి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో మళ్లీ చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. అంతర్రాష్ట్ర నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ స్వామి, ఎస్‌ఐ మహేష్, ఏఏఓ సల్మాన్ పాషాతో పాటు సీసీఎస్, మిల్స్ కాలనీ పోలీస్ సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అభినందించారు. ఈ వివరాలను సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత వెల్లడించారు.

## మండల స్థాయి ప్రజావాణికి ఆదరణ కరువు!

**మొదటి వారం 8 దరఖాస్తులు.. ఈ వారం ఒక్కటీ రాలేదు**

**సమస్యలు ఉన్నా ప్రజావాణికి రాని ప్రజలు**

**అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యమా?**

**ప్రజావాణిపై ప్రజల్లో నమ్మకం పెంచాలి**




కాకతీయ, గీసుగొండ : ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణికి గీసుగొండ మండలంలో స్పందన కరువవుతోంది. ప్రతి వారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నప్పటికీ.. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గత వారం 8 దరఖాస్తులు అందగా.. ఈ వారం ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలకు వ్యక్తిగత, భూ సమస్యలతో పాటు రేషన్ కార్డులు, పింఛన్లు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర సమస్యలు ఎదురవుతున్నాయి. అయినప్పటికీ వాటిని ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావడంలో ప్రజలు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రజావాణి నిర్వహణ అసలు లక్ష్యంపూర్తిస్థాయిలోనెరవేరడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### అవగాహన కల్పించడంలో లోపమా?

ప్రజావాణి ద్వారా తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసి పరిష్కారం పొందే అవకాశం ఉన్నప్పటికీ.. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఈ కార్యక్రమంపై తగినంత అవగాహన లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజావాణి నిర్వహించే విషయం ప్రతి గ్రామంలోని ప్రజలకు చేరేలా అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు సూచిస్తున్నారు. కొంతమంది ప్రజలు సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల కార్యాలయాలను నేరుగా ఆశ్రయిస్తుండగా.. మరికొందరు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా వెంటనే పరిష్కారం అవుతుందా అనే సందేహంతో వెనుకంజ వేస్తున్నారనే చర్చ జరుగుతోంది. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలను ప్రజలకు తెలియజేస్తే కార్యక్రమంపై మరింత నమ్మకం పెరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

### దరఖాస్తులు రాకపోవడం.. సమస్యలు లేవని కాదు

ఒక వారం 8 దరఖాస్తులు రావడం.. మరుసటి వారం ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం ద్వారా మండలంలో ప్రజా సమస్యలు లేవని భావించలేం. గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటిని ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ వేదికను సద్వినియోగం చేసుకునేలా అధికారులు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం కనిపిస్తోంది. ప్రజల సమస్యలను పరిష్కరించే వేదికగా ప్రజావాణికి ప్రాధాన్యం పెంచాల్సిన అవసరం ఉంది. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు కార్యక్రమం వివరాలు తెలియజేయడంతో పాటు.. దరఖాస్తుల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై స్పష్టత కల్పిస్తే స్పందన పెరిగే అవకాశం ఉంది. లేకపోతే ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజావాణి కేవలం మొక్కుబడి కార్యక్రమంగా మిగిలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

- రాయపర్తి రైతు వేదికలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



కాకతీయ, రాయపర్తి : అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం రాయపర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణంలో నిర్వహించిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా పంపిణీ వ్యవస్థ(పిడిఎస్)ను మరింత బలోపేతం చేసేందుకే ప్రభుత్వం డిజిటల్ కార్డులను తీసుకువచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో కొత్త రేషన్ కార్డులను అందించడంలో విఫలమైందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్నా హామీని నిలబెట్టుకుంటుందని గుర్తుచేశారు. నిరుపేదలకు ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. తహసిల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో పాక శ్రీనివాసులు,ఆర్ఐ చంద్ర మోహన్,పౌరసరఫరాల శాఖ అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు,వివిధ గ్రామాల సర్పంచులు,పార్టీ నాయకులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

### పరామర్శ..

రాయపర్తి మండల కేంద్రానికి చెందిన చేగొండ సాయి ఇటీవల ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి చేరుకొని ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుని,బాధితుడికి ధైర్యం చెప్పారు.అలాగే శివరాంపురం గ్రామానికి చెందిన భూక్యా లచ్చు తండ్రి భూక్య వస్రం ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

తండాల అభివృద్ధికి నిధులు

## రూ.7.01 కోట్ల నిధులు మంజూరు

- సూర్య తండాకు రూ.4.14 కోట్లు కేటాయింపు
- సీసీ రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం
- మంత్రులకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ భానోతు రాఘవేంద్ర



కాకతీయ, గీసుగొండ : తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.7.01 కోట్ల నిధులు మంజూరు చేసిన మంత్రి కొండా సురేఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు సేవాలాల్ గోర్ బంజారా ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సూర్య తండా సర్పంచ్ భానోతు రాఘవేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం సూర్య తండా గ్రామపంచాయతీ పరిధిలో ఆయన ఆధ్వర్యంలో కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. మంజూరైన నిధుల్లో సూర్య తండాకు రూ.4.14 కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించి మౌలిక వసతులు మెరుగుపడతాయన్నారు. నిధుల మంజూరులో చొరవ చూపిన జిల్లా నాయకుడు రడం భరత్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, తండా పెద్దలు, యువకులు, నాయకులు పాల్గొన్నారు.

# సాగుకు సిద్ధం చేస్తున్న ఎస్సారెస్పీ భూములు!




ఎస్సారెస్పీ భూముల కబ్జా



- దుక్కులు దున్ని.. పైపులైన్లు వేసి సాగుకు ఏర్పాట్లు
- అధికారుల హెచ్చరికల తర్వాతా ఆగని ఆక్రమణ పనులు
- చెట్లు పెంచుతామన్న అధికారుల మాటలు.. క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితి
- చర్యలు లేకపోవడంపై అధికారుల తీరుపై అనుమానాలు

కాకతీయ, శంకరపట్నం : ప్రభుత్వ భూములకు రక్షణ కరువవుతోందా? అధికారులు హెచ్చరించినా ఆక్రమణ పనులు ఆగడం లేదా? కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులోని ఎస్సారెస్పీ భూముల విషయంలో ప్రస్తుతం ఇవే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆధీనంలోని భూమిని కొందరు దుక్కులు దున్ని, నీటి పైపులైన్లు ఏర్పాటు చేసి సాగుకు సిద్ధం చేస్తున్నా.. అధికారులు మాత్రం కఠిన చర్యలకు ఉపక్రమించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేశవపట్నం గ్రామ శివారులో ఎస్సారెస్పీ భూమిని సాగుకు సిద్ధం చేస్తున్న విషయం తెలుసుకున్న ఎస్సారెస్పీ ఏఈ పావని అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేయవద్దని సంబంధిత వ్యక్తిని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ భూమిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో చెట్లు పెంచనున్నట్లు అధికారులు చెప్పినట్లు సమాచారం. ఆక్రమణకు పాల్పడితే కేసు నమోదు చేస్తామని కూడా స్పష్టం చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు హెచ్చరించి వెళ్లిన తర్వాత కూడా అదే భూమిలో ఆక్రమణ పనులు కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దుక్కులు దున్నడంతో పాటు నీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్నారు. అధికారుల ప్రత్యక్ష పరిశీలన, హెచ్చరికల తర్వాత కూడా పనులు కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూమిలో సాగుకు ఇంత బహిరంగంగా ఏర్పాట్లు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### అధికారుల తీరుపై అనుమానాలు

ప్రభుత్వ భూమిని పరిరక్షించాల్సిన అధికారులు కేవలం హెచ్చరికలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకుండా వదిలేయడం వల్లే మళ్లీ పనులు కొనసాగుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్వయంగా పరిస్థితిని పరిశీలించిన తర్వాత కూడా దుక్కులు దున్ని, పైపులైన్లు వేసే స్థాయిలో ఆక్రమణ పనులు కొనసాగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులపై ముడుపులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నప్పటికీ.. వాటికి సంబంధించి పూర్తిస్థాయి ఆధారాలు, అధికారిక నిర్ధారణ మాత్రం వెలువడాల్సి ఉంది. ఎస్సారెస్పీ భూమిలో ప్రస్తుతం జరుగుతున్న పనులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారన్నది స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. ఎస్సారెస్పీ భూములను కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. కేవలం హెచ్చరికలు జారీ చేసి వదిలేయకుండా.. ఆక్రమణలను అడ్డుకుని, ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కేశవపట్నం శివారులోని ఎస్సారెస్పీ భూములపై జరుగుతున్న ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల హెచ్చరికల తర్వాత కూడా పనులు కొనసాగుతున్న నేపథ్యంలో.. ఇకనైనా అధికారులు కఠినంగా వ్యవహరిస్తారా? అన్నది వేచి చూడాలి.

# యూరియా లేక రైతుల ఆవేదన

- ఉమ్మడి మానాలలో బుకింగ్‌కు బ్రేక్
- పది రోజులుగా రైతు వేదిక చుట్టూ ప్రదక్షిణలు
- పోడు భూముల రైతులకు ఎరువులు ఇవ్వడం లేదంటూ ఆగ్రహం
- పట్టా రైతులకు ఇస్తే.. తమకెందుకు ఇవ్వరని ప్రశ్న



కాకతీయ, రుద్రంగి : సాగు చేసిన పంటలకు యూరియా అందక రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం ఉమ్మడి మానాల గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజులుగా యూరియా బుకింగ్ కోసం రైతు వేదికకు తిరుగుతున్నా ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడు భూముల్లో సాగు చేస్తున్న రైతులకు యూరియా అందించకపోవడంపై వారు నిరసనకు దిగారు. గత ప్రభుత్వం జారీ చేసిన పోడు భూముల ప్రొసీడింగ్ కాపీలను చూపిస్తూ.. పట్టా భూముల రైతులకు యూరియా ఇస్తున్నప్పుడు తమకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం సాగుకు అనుమతులు ఇచ్చి ప్రొసీడింగ్‌లు అందజేసినప్పటికీ ఎరువుల విషయంలో తమను పక్కన పెట్టడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. వానాకాలం పంటలకు ప్రస్తుతం యూరియా అత్యవసరమని, పది రోజులుగా బుకింగ్ కోసం ప్రయత్నిస్తున్నా ఆన్‌లైన్‌లో నమోదు కాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ''యూరియా లేకపోతే పంటలను ఎలా కాపాడుకోవాలి..?'' అని ప్రశ్నించారు. పోడు భూముల ప్రొసీడింగ్‌లను ప్రాతిపదికగా తీసుకుని వెంటనే యూరియా బుకింగ్‌కు అవకాశం కల్పించాలని, అర్హులైన రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని ఉమ్మడి మానాల రైతులు డిమాండ్ చేశారు.

# సాలరీ అకౌంట్ ప్రయోజనాలు తెలుసుకోవాలి

### అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ

కాకతీయ, ఖమ్మం : ప్రభుత్వ ఉద్యోగులు సాలరీ బ్యాంక్ అకౌంట్ ద్వారా లభించే బీమా, బ్యాంకింగ్ తదితర ప్రయోజనాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగులకు సాలరీ అకౌంట్ ప్రయోజనాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఉద్యోగి సహజ మరణానికి రూ.10 లక్షలు, ప్రమాదవశాత్తు మరణానికి రూ.కోటి, విమాన ప్రమాదంలో మృతికి రూ.1.60 కోట్ల వరకు బీమా రక్షణ ఉంటుందని తెలిపారు. శాశ్వత పూర్తి వైకల్యానికి రూ.కోటి, పాక్షిక వైకల్యానికి రూ.80 లక్షల వరకు కవరేజ్ అందుబాటులో ఉందన్నారు. ఉన్నత విద్య, బాలికల వివాహానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం పొందవచ్చని వివరించారు. ఎస్‌బీఐ స్టేట్ గవర్నమెంట్ సాలరీ ప్యాకేజీ (ఎస్‌జీఎస్‌పీ)లో వేతనాన్ని బట్టి రోడియం, ప్లాటినం, డైమండ్, గోల్డ్, సిల్వర్ కేటగిరీలు ఉన్నాయని తెలిపారు. లాకర్ ఛార్జీలపై 50 శాతం రాయితీ, ఎస్‌బీఐ ఏటీఎంలలో అపరిమిత ఉచిత లావాదేవీలు తదితర సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి ఉద్యోగి తన ఎస్‌బీఐ ఖాతా సాలరీ అకౌంట్‌గా కొనసాగుతోందో లేదో పరిశీలించుకోవాలని, సందేహాలుంటే బ్యాంకు అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీఐ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మైనారిటీ మహిళలకు శిక్షణ, ఉపాధి కల్పనకు కేంద్రం

- కమ్యూనిటీ ట్రైనింగ్ అండ్ ప్రొడక్షన్ సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం
- మైనారిటీస్, ముస్లిం ఎన్‌జీవోలు, బైతుల్‌మాల్ సంస్థలకు అవకాశం
- ఆగస్టు 31లోగా దరఖాస్తులు సమర్పించాలి
- అర్హ సంస్థలు దరఖాస్తు చేసుకోవాలి: జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్

కాకతీయ, ఖమ్మం టౌన్ : మైనారిటీ మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఖమ్మం జిల్లాలో కమ్యూనిటీ ట్రైనింగ్ అండ్ ప్రొడక్షన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్ తెలిపారు. తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కేంద్రం ఏర్పాటుకు అర్హులైన మైనారిటీస్, ముస్లిం ఎన్‌జీవోలు, బైతుల్‌మాల్ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే సంస్థలు మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతంలో 240 చదరపు గజాల భూమి కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి ప్రాజెక్టు నివేదికతో పాటు గత మూడేళ్ల వార్షిక, ప్రోగ్రెస్ నివేదికలు, వర్క్ ఆర్డర్ల విలువ, ప్రొడక్షన్ వివరాలు సమర్పించాలన్నారు. ప్రొవిజినల్ బ్యాలెన్స్‌షీట్, మూడేళ్ల ప్రాఫిట్ అండ్ లాస్ ఖాతాలు, ఆడిట్ నివేదికలు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు జత చేయాలని సూచించారు. ట్రైనింగ్ సెంటర్ నిర్వహణకు ప్రత్యేక బ్యాంక్ ఖాతా, కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు ట్రస్ట్ డీడ్, ట్రస్టీల వివరాలు, ప్రతిపాదిత ప్రదేశం, అక్కడి ప్రాథమిక సౌకర్యాల ఫొటోలు సమర్పించాలని తెలిపారు. అర్హ సంస్థలు ఆగస్టు 31లోగా కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం, రెండో అంతస్తు, రూమ్ నంబర్ S-29లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 9704003002ను సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో నలుగురికి చేరిన మృతుల సంఖ్య

- ఒకే కుటుంబాన్ని కబళించిన మృత్యువు
- ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు.. చికిత్స పొందుతూ నలుగురు మృతి
- రుద్రంగిలో విషాదఛాయలు.. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్









కాకతీయ, రుద్రంగి : రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట శివారులోని పెద్దమ్మ ఆలయం సమీపంలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. రుద్రంగికి చెందిన ఒకే కుటుంబంలోని ఆరుగురు వివాహ వేడుకకు వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ నలుగురు మృతి చెందడంతో రుద్రంగిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షాదుల్లా, ఆయన భార్య హసీనా శనివారం రాత్రే మృతి చెందారు. అనంతరం మరో హసీనా ఆదివారం రాత్రి, పదో తరగతి చదువుతున్న రిమ్సా సోమవారం ఉదయం మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడటంతో గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

### బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. సోమవారం వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించినప్పటికీ నలుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని, అతివేగానికి దూరంగా ఉండాలని కోరారు. ఆది శ్రీనివాస్ తనయుడు ఆది కార్తిక్ బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే కూడా మృతుల కుటుంబాలను పరామర్శించారు.

# బకాయిలు చెల్లించండి.. లేదంటే సమరమే!

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.15 వేల కోట్లు.. వెంటనే విడుదల చేయాలి
- 22ఏ భూములపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- పెద్ద సంస్థలకు భూముల కేటాయింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించకపోతే ఆందోళన
- బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు




కాకతీయ, ఖమ్మం టౌన్ : విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతోందని ఆ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.15 వేల కోట్లకు చేరాయని, ప్రభుత్వం చెల్లింపుల్లో జాప్యం చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులు, పార్టీ శ్రేణులతో కలిసి హైదరాబాద్‌లో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఖమ్మంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడారు. ఫీజు బకాయిల కారణంగా కళాశాలలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని, చదువులు, ఉన్నత విద్య, భవిష్యత్తు అవకాశాలపై ప్రభావం పడుతోందని అన్నారు. బకాయిల విడుదల కోసం మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన నిరాహార దీక్షకు ఖమ్మం జిల్లా బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఖమ్మం నుంచి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులతో హైదరాబాద్‌కు తరలివెళ్లి ఆందోళనలో పాల్గొంటామని చెప్పారు.

### 22ఏ భూములపై సమాధానం చెప్పాలి

ఖమ్మం జిల్లాలో 22ఏ నిషేధిత భూముల జాబితా కారణంగా సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. భూములు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్లు పూర్తయిన తర్వాత కూడా రికార్డుల్లో తలెత్తుతున్న వివాదాలతో ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. భూ రికార్డుల్లో పూర్తి పారదర్శకత తీసుకురావాలని కోరారు. సామాన్యుల భూములకు ఆంక్షలు విధిస్తున్న ప్రభుత్వం పెద్ద సంస్థలకు భూముల కేటాయింపుల్లో ఏ విధానాన్ని అనుసరిస్తోందో వెల్లడించాలని ప్రశ్నించారు. ఫీనిక్స్ తదితర సంస్థలకు జరిగిన భూ కేటాయింపుల పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. భూముల స్వభావం, కేటాయింపు విధానం, అనుసరించిన నిబంధనలు, ప్రభుత్వానికి కలిగిన ప్రయోజనాలను వెల్లడిస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ, అటవీ, దేవాదాయ భూముల విషయంలోనూ సమగ్ర పరిశీలన జరపాలని అన్నారు.

### హామీల అమలులో విఫలం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కోటేశ్వరరావు విమర్శించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత, రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతులు, పంటల కొనుగోళ్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్నదాతలు, ఉపాధి అవకాశాల కోసం చూస్తున్న నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం ఇకనైనా నిర్ణయం తీసుకోకపోతే జర్నలిస్టుల తరఫున బీజేపీ ప్రత్యక్ష ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు. అవసరమైతే న్యాయపరమైన పోరాటం కూడా చేస్తామని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, 22ఏ భూముల వ్యవహారం, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోటేశ్వరరావు కోరారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, నాయకులు మందడపు సుబ్బారావు, కృష్ణయ్య, రుద్రగాని మాధవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు పకడ్బందీగా నోటీసులు

- ఖమ్మం జిల్లాలో 1.75 లక్షల నోటీసుల జారీకి ప్రణాళిక
- ఇప్పటికే 75 వేల నోటీసులు జనరేట్
- 80 వేల మంది ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు
- నోటీసుల్లో విచారణ తేదీ, సమయం, ప్రదేశం స్పష్టంగా పేర్కొనాలి
- ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి
- కలెక్టర్ దివాకర టీఎస్

కాకతీయ, ఖమ్మం : అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్‌పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు కలిపి సుమారు 1.75 లక్షల నోటీసులు జారీ చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 75 వేల నోటీసులు జనరేట్ చేసినట్లు చెప్పారు. అనామలీస్ కింద సుమారు 80 వేల మంది ఓటర్ల పేర్లలో వ్యత్యాసాలు ఉన్నట్లు వివరించారు. నోటీసులు జారీ చేసే సమయంలోనే విచారణకు సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి నోటీసులో విచారణ తేదీ, సమయం, ప్రదేశాన్ని స్పష్టంగా పేర్కొనాలని, నోటీసు జారీకి–విచారణకు మధ్య కనీసం ఏడు రోజుల వ్యవధి ఉండాలని ఆదేశించారు. నోటీసుల వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఫొటోతో నమోదు చేయడంతో పాటు, విచారణ వివరాలు, ఓటర్లు సమర్పించిన ఆధారాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు.



> ‘‘రాజకీయాల్లోకి రావాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. కానీ మా వారి రాజకీయ జీవితం.. మా మామ ప్రోత్సాహం నన్ను అనుకోకుండా రాజకీయాల్లోకి తీసుకొచ్చాయి. 1991లో పీఏసీఎస్ చైర్మన్‌గా పోటీ చేసినప్పటి నుంచి గెలుపోటములు, పదవులు, అవమానాలు, ప్రలోభాలు ఎన్నో చూశాం. కష్టకాలంలో ఇతర పార్టీల నుంచి ఎన్ని ఆఫర్లు వచ్చినా కాంగ్రెస్‌ను వీడలేదు. వైఎస్సార్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుని నన్ను మేయర్‌ను చేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా నా పనితీరును గుర్తించి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అవకాశం ఇచ్చారు. పదవులు అడిగి తీసుకోవడం నా పద్ధతి కాదు.. పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా వంద శాతం పనిచేయడమే తెలుసు. రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదు. పార్టీ అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేస్తా’’ అని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ తెలిపారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆమె తన బాల్యం, వివాహం, అత్తింటి అనుబంధం, భర్త వరద రాజేశ్వర్‌రావుతో కలిసి సాగించిన రాజకీయ ప్రస్థానం, 1991లో రాజకీయ అరంగేట్రం, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటమి, 2005లో మేయర్‌గా అవకాశం, నగరాభివృద్ధి, కాంగ్రెస్‌తో సుదీర్ఘ అనుబంధం, వైఎస్సార్, రేవంత్‌రెడ్డితో తనకున్న అనుబంధం, మహిళా కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలను తన మాటల్లోనే పంచుకున్నారు.



# మా వారి నుంచే రాజకీయ ఓనమాలు!

## మామ ప్రోత్సాహంతో 1991లో రాజకీయ అరంగేట్రం

- వైఎస్సార్ ఇచ్చిన మాట తప్పలేదు.. ఆయనే నా అన్న
- 2005లో వరంగల్ తొలి మేయర్‌గా అవకాశం
- మేయర్‌గా రూ.178 కోట్ల నిధులతో నగరంలో చారిత్రాత్మక అభివృద్ధి
- పదవులు ఉన్నా.. లేకున్నా కాంగ్రెస్‌ను వీడలేదు
- కష్టకాలంలో అనేక రాజకీయ ఆఫర్లు వచ్చినా.. వద్దనుకున్నాం
- సీఎం రేవంత్‌రెడ్డి నా పనితీరును గుర్తించారు
- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నన్ను ప్రోత్సహిస్తున్నారు
- రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదు.. పార్టీ అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా
- డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

### మా వారి నుంచే రాజకీయ ఓనమాలు

‘‘మా వారు వరద రాజేశ్వర్‌రావు 1985 నుంచే వర్ధన్నపేట రాజకీయాల్లో ఉన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకుడిగా పనిచేశారు. సంజయ్‌గాంధీ వచ్చినప్పుడు ఆయన కోసం అండాల కొద్దీ పులిహోర తయారు చేసి రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి ఇచ్చిన విషయం నాకు ఇప్పటికీ గుర్తుంది. రాజకీయాల్లో ప్రజలతో ఎలా ఉండాలి? కార్యకర్తలను ఎలా చూసుకోవాలి? ప్రజా సమస్యలపై ఎలా స్పందించాలి? అనే విషయాలను ఆయన నుంచే నేర్చుకున్నా. మా మామ కులశేఖర్‌రావు మాత్రం నన్ను ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. 1991లో వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్ ఎన్నికలు వచ్చినప్పుడు నన్ను పోటీ చేయమన్నారు. పిల్లలు చిన్నవాళ్లు.. నేను రాజకీయాల్లోకి ఎలా వస్తానని మొదట వెనుకాడా. కానీ మామ, మా వారు పట్టుబట్టారు. చివరకు పోటీ చేశా. పెద్దగా ప్రచారం చేయలేదు. ఒక్కరోజు మాత్రమే ప్రచారం చేసినా గెలిచా. అలా 1991లో నా రాజకీయ అరంగేట్రం జరిగింది. ఆ తర్వాత ఓడీసీఎంఎస్ డైరెక్టర్‌గా కూడా పోటీ చేశా. అందులోనూ గెలిచా. అయితే చైర్మన్ పదవి విషయంలో సొంత పార్టీలోనే నాకు అనుకూల పరిస్థితి లేకపోవడంతో ఆ అవకాశం దక్కలేదు. బీరం సంజీవరెడ్డి చైర్మన్‌గా అయ్యారు. రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలోనే గెలుపుతో పాటు ఇలాంటి అనుభవాలూ ఎదురయ్యాయి.’’

### వర్ధన్నపేటతో నాలుగు దశాబ్దాల అనుబంధం

‘‘1985లో మా వారికి గాంధీభవన్ నుంచి ఎమ్మెల్యే టికెట్ వచ్చినట్లు ఫోన్ వచ్చింది. అప్పటికి నాకు రాజకీయాల్లో టికెట్ అంటే ఏమిటో కూడా పూర్తిగా తెలియదు. మాధవరావు మనుమడు అన్న గుర్తింపు తప్ప రాజేశ్వర్‌రావుకు పెద్దగా రాజకీయ పరిచయం లేదు. అయినా పోటీ చేశారు. సుమారు పది వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ ఓటమి తర్వాత ఆయన ప్రజలకు మరింత దగ్గరయ్యారు. ఎన్నికల్లో ఓడిపోయిన మరుసటి రోజు నుంచే ఉదయం 7 గంటలకే గ్రామాల్లోకి వెళ్లేవారు. ప్రతి ఒక్కరినీ కలుసుకుని వారి సమస్యలు తెలుసుకునేవారు. అలా ప్రజలతో బంధం పెంచుకున్నారు. తర్వాత మళ్లీ టికెట్ వచ్చినా ఎన్నికలకు ముందు రోజు అభ్యర్థిని మార్చిన సందర్భం ఉంది. మా వారు బీఫాంతో నామినేషన్ వేయడంతో చేయి గుర్తు కూడా వచ్చింది. పార్టీలోనే ఇద్దరు అభ్యర్థులు ఉండటంతో సుమారు ఐదు వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఎన్ని ఎత్తుపల్లాలు వచ్చినా వర్ధన్నపేట ప్రజలతో ఉన్న సంబంధాన్ని మాత్రం వదులుకోలేదు. మా కుటుంబానికి అక్కడ ఇప్పటికీ కార్యకర్తలతో, ప్రజలతో అనుబంధం ఉంది.’’

### కష్టకాలంలోనూ కాంగ్రెస్‌నే నమ్ముకున్నాం

‘‘మా కుటుంబానికి కాంగ్రెస్‌తో ఉన్న అనుబంధం చాలా పాతది. రాజకీయంగా అన్ని పార్టీల నాయకులతో వ్యక్తిగత సంబంధాలు ఉండొచ్చు. కానీ పార్టీ విషయంలో మాత్రం మేం ఎప్పుడూ కాంగ్రెస్‌ను వీడలేదు. ఎన్ని సమస్యలు వచ్చినా కాంగ్రెస్‌లోనే ఉన్నాం. కష్టకాలంలో అనేక రాజకీయ ఆఫర్లు వచ్చాయి. కేసీఆర్ కూడా మమ్మల్ని పిలిచారు. అయినా వెళ్లలేదు. పదవులు ఉన్నప్పుడు పార్టీతో ఉండటం ఒక విషయం. పదవులు లేకపోయినా పార్టీతోనే ఉండటం మరో విషయం. మేం రెండో దారినే ఎంచుకున్నాం. జీవితమంతా కాంగ్రెస్‌తోనే మా ప్రయాణం. పదవి కోసం పార్టీ మారడం మా కుటుంబానికి అలవాటు లేదు.’’

### నేను ఓడినా.. వైఎస్సార్ మాట తప్పలేదు

‘‘ఎన్నికల్లో ఓడిపోయినా వైఎస్సార్ నాకు ఇచ్చిన మాటను మర్చిపోలేదు. 2005లో వరంగల్ మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. నేను కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలిచా. మేయర్ పదవికి అప్పటికే తీవ్రమైన పోటీ ఉంది. పలువురు నేతలు తమ కుటుంబాల నుంచి మేయర్‌ను చేయాలని ప్రయత్నించారు. నేను మాత్రం మేయర్ పదవి కావాలని ఎక్కడా అడగలేదు. మా వారితో కలిసి వైఎస్సార్‌ను కలిశాం. ఆయన ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. బలమైన పోటీదారులు ఉన్నా నన్ను మేయర్‌గా చేశారు. అలా 2005లో వరంగల్ మున్సిపాలిటీ తొలి మేయర్‌గా బాధ్యతలు చేపట్టా. అది నా రాజకీయ జీవితంలో ఎంతో కీలకమైన మలుపు. వైఎస్సార్ నాకు రాజకీయ నాయకుడే కాదు.. అన్న లాంటి వారు. ఆయన ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అందుకే ఇప్పటికీ ఆయనను నా అన్నగా భావిస్తా.’’

### రూ.178 కోట్లతో నగరాభివృద్ధి

‘‘మేయర్‌గా ఉన్న సమయంలో నగర అభివృద్ధికి ప్రత్యేకంగా పనిచేశా. ఎవరూ ఊహించని స్థాయిలో రూ.178 కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేశాం. ప్రధాన జంక్షన్ల విస్తరణ, అభివృద్ధి, తాగునీటి సరఫరా, స్లమ్ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చాం. అప్పటి కేంద్ర మంత్రి దివంగత జయపాల్‌రెడ్డి ఎంతో సహకరించారు. ముఖ్యమంత్రి వైఎస్సార్ కూడా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందించాం. మహిళలను లక్షాధికారులుగా చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాలు చేపట్టాం. మేయర్‌గా నగరానికి చేయగలిగినంత చేశానన్న సంతృప్తి నాకుంది.’’

### మా అంకితాభావాన్ని రేవంత్‌రెడ్డి గుర్తించారు

‘‘రేవంత్‌రెడ్డి పాదయాత్ర సమయంలో వరంగల్‌కు వచ్చినప్పుడు మా కుటుంబాన్ని కలిశారు. మా కుటుంబం కాంగ్రెస్ కుటుంబమని చెప్పారు. కాంగ్రెస్‌కు ఆ ఎన్నికలు చివరి అవకాశమని, పార్టీని గెలిపించడానికి పనిచేయాలని కోరారు. ఆయన మాట మేరకు పనిచేశాం. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా నేను ఎలాంటి పదవీ అడగలేదు. నా పనితీరును ఆయనే గుర్తించారు. 2023లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించారు. ఆ ప్రకటన వచ్చినప్పుడు నేను ఆస్ట్రేలియాలో ఉన్నా. పదవులు అడిగి తీసుకోవడం నాకు అలవాటు లేదు. పార్టీ కోసం పనిచేస్తే ఏదో ఒక రోజు గుర్తింపు వస్తుందనే నమ్మకం నాది. సీఎం రేవంత్‌రెడ్డి నా పనితీరును గుర్తించి ప్రోత్సహిస్తున్నందుకు సంతోషంగా ఉంది.’’

### 19 ఏళ్లకే పెళ్లి.. రాజకీయ కుటుంబంలో అడుగు

‘‘మాది కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం పాతగూడూరు. మా నాన్న హన్మంతరావు లాయర్‌గా ప్రాక్టీస్ చేసి, ఆ తర్వాత కాంట్రాక్టర్‌గా పనిచేశారు. మాకు అక్క, చెల్లి, తమ్ముడు ఉన్నారు. మా కుటుంబానికి ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. ఇంటర్ వరకు కరీంనగర్ నగరంలోనే చదువుకున్నా. ఇంటర్‌లో ఉండగానే 19 ఏళ్లకే పెళ్లి కావడంతో చదువు కొనసాగించలేకపోయా. అక్క భర్తకు స్నేహితుడైన వరద రాజేశ్వర్‌రావుతో పరిచయం ద్వారా నా పెళ్లి సంబంధం వచ్చింది. ఆయన అప్పట్లో ఉద్యోగం చేయకపోవడంతో మా ఇంట్లో కొంత సందేహం వచ్చింది. కానీ ఆయన మంచివారని చెప్పి పెళ్లిచూపులు ఏర్పాటు చేశారు. నాకు ఆయన నచ్చారు.. ఆయనకు కూడా నేను నచ్చడంతో పెళ్లి జరిగింది. అప్పట్లో ఆడవాళ్లం గడీల నుంచి బయటకు వచ్చేవాళ్లం కాదు. రాజకీయాలు, పదవులు అనేవి మా జీవితంలో ఉంటాయని ఊహించలేదు. కానీ పెళ్లి తర్వాత అత్తింట్లో నాకు చాలా గౌరవం లభించింది. మా మామ కులశేఖర్‌రావు, అత్త లక్ష్మీదేవి నన్ను కోడలిగా కాకుండా కూతురిలా చూసుకున్నారు. మా మామే నన్ను రాజకీయంగా ప్రోత్సహించారు. మా వారి రాజకీయ ప్రయాణాన్ని దగ్గరగా చూస్తూ నేర్చుకున్నా. అదే తర్వాత నా జీవితానికి కొత్త దారిని చూపించింది.’’

### 20 జిల్లాల్లో మహిళా కాంగ్రెస్ బలోపేతం

‘‘రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఇప్పటివరకు 20 జిల్లాల్లో పర్యటించా. మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్నా. మండల స్థాయి కమిటీల ఏర్పాటుపై దృష్టి పెట్టాం. మహిళలు కేవలం పార్టీ కార్యక్రమాలకు హాజరయ్యేవారిగా కాకుండా.. ఎన్నికల వ్యూహాల్లో కీలక భాగస్వాములుగా ఉండాలి. రానున్న ఎన్నికల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలి. మహిళా కాంగ్రెస్‌ను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలి. హైదరాబాద్ మేయర్ పదవిని కాంగ్రెస్ గెలుచుకోవాలని కోరుకుంటున్నా. జీహెచ్ఎంసీతో పాటు జీడబ్ల్యూఎంసీలోనూ పార్టీ బలోపేతం కావాలి. రాష్ట్ర మహిళా కాంగ్రెస్‌కు అప్పగించిన బాధ్యతను పూర్తి స్థాయిలో నిర్వర్తించడమే నా లక్ష్యం.’’





### రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదు

‘‘రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదు. నాకు ఓపిక ఉన్నంతకాలం కాంగ్రెస్ కోసం పనిచేస్తా. సుమారు ఐదు దశాబ్దాలుగా మా కుటుంబం పార్టీతో కలిసి నడుస్తోంది. పదవులు వచ్చినా.. పోయినా మా ప్రయాణం ఆగలేదు. కష్టకాలంలో కూడా పార్టీని వీడలేదు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా అని అడుగుతున్నారు. పార్టీ అవకాశం ఇస్తే తప్పకుండా పోటీ చేస్తా. పదవి కోసం నేను ఎప్పుడూ పరుగులు పెట్టలేదు. పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా, ఏ పని చెప్పినా వంద శాతం కష్టపడి పనిచేస్తా. నన్ను నమ్మి ఇచ్చిన బాధ్యతను నిలబెట్టుకోవడమే నాకు ముఖ్యం. మా వారి నుంచి నేర్చుకున్న రాజకీయ ఓనమాలు.. మామ ఇచ్చిన ప్రోత్సాహం.. వైఎస్సార్ ఇచ్చిన మాట.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఇస్తున్న ప్రోత్సాహం.. ఇవన్నీ నా రాజకీయ ప్రయాణంలో మరిచిపోలేని అధ్యాయాలు’’ అని ఎర్రబెల్లి స్వర్ణ తెలిపారు.

### వైఎస్సార్ పిలిచి.. “టికెట్ ఇస్తా” అన్నారు

“మేం పదవుల్లో ఉన్నామా? లేదా? అన్నది చూడకుండా కాంగ్రెస్‌లోనే పనిచేస్తున్న తీరును వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తించారు. 2004లో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షల సమయంలో వర్ధన్నపేటలో ఐదు నియోజకవర్గాల సమీక్ష ఏర్పాటు చేయాలని మా వారికి ఫోన్ చేశారు. అప్పుడు డీసీసీ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మా వారు రాజేశ్వర్‌రావు వైఎస్సార్‌తో కలిసి ఉన్నారు. అప్పుడు నన్ను పిలిచి ‘వచ్చే ఎన్నికల్లో నువ్వే పోటీ చేయాలి.. టికెట్ ఇస్తా’ అని చెప్పారు. ఒకవేళ ఓడిపోయినా తాను చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఆ మాట నాకు ఎంతో ధైర్యం ఇచ్చింది. అప్పటికే నియోజకవర్గంలో ప్రత్యర్థులు బలంగా ఉన్నారు. అయినా పోటీ చేశా. తీగరాజుపల్లిలో వైఎస్సార్‌తో భారీ బహిరంగ సభ నిర్వహించాం. ఇసుక పోస్తే రాలనంతగా జనం వచ్చారు. ఆ సభను విఫలం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. నా కుమారులను కూడా కొట్టారు. ఎన్నికలకు రెండు రోజుల ముందు ప్రత్యర్థి వర్గం చంద్రబాబుతో సమావేశం ఏర్పాటు చేసి మా వాళ్లను ప్రలోభపెట్టిందని నేను భావించా. దగ్గరి వాళ్లే మమ్మల్ని మోసం చేశారు. చివరకు నాలుగు వేల ఓట్ల తేడాతో ఓడిపోయా. అయినా మా కేడర్ బలమే నన్ను అంత దగ్గర వరకు తీసుకెళ్లింది.”

కాకతీయ, తెలంగాణ బ్యూరో/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266